జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 243 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: తృతీయ - 25:08:31 వరకు నక్షత్రంకృతిక - 13:26:41 వరకు కరణంవణిజ - 14:38:41 వరకు, విష్టి - 25:08:31 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 07:18:20 వరకు, వారీయన - 27:40:16 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

దరఖాస్తుకు ముందే డిజిలాకర్, కేవైసీ రెడీ చేసుకోవాలి

పదో తరగతి సర్టిఫికెట్‌తో పేరు, పుట్టిన తేదీ సరిపోలాలి

జేఈఈ మెయిన్ అభ్యర్థులకు ఎన్టీఏ కీలక సూచనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2027కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కీలక సూచనలు జారీ చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైన

మిగతా 2లో..

నీటి దుర్వినియోగాన్ని అరికట్టేలా చర్యలు

"పానీ" యాప్‌ను ఆవిష్కరించిన జలమండలి

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): నీటి సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న హైదరాబాద్ నగర జనాభా, తగ్గుతున్న

మిగతా 2లో..

పూర్తి సహకారం

అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది

- అభివృద్ధిపై కేంద్రంతో కలిసి ముందుకు..
- ఆర్ఆర్ఆర్ తెలంగాణ గేమ్ ఛేంజర్గా మారింది
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల తెలంగాణ
- తెలంగాణలో పెట్టుబడులు రెట్టింపు చేయాలి
- తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలి..
- ప్రభుత్వ సహకారానికి వ్యక్తిగతంగా కృషి చేస్తా..
- రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి నాది భరోసా
- పెట్టుబడిదారులకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు
- పెట్టుబడిదారుల పెట్టుబడులకు రేవంత్ భరోసా
- వికసిత్ భారత్ లక్ష్యానికి అంతా కలిసి పనిచేయాలి
- కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- ఢిల్లీలో గ్లోబల్ సమ్మిట్-2026 సన్నాహక కార్యక్రమం
- ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాక

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాల దిశగానే తెలంగాణ సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో 10 శాతాన్ని తెలంగాణ కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఢిల్లీలో తాజ్ ప్యాలెస్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై పెట్టుబడిదారులను ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు.

న్యూఢిల్లీ, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి తనది భరోసా అని సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సన్నాహక కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు,

మిగతా 2లో..

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ అమలు

నియామకాలు, పదోన్నతులు, బదిలీలకు వర్తింపు

కీలక ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణా ప్రభుత్వం

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ అమలుపై కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పదోన్నతులు, బదిలీలతో పాటు విద్యాసంస్థల్లో ప్రవేశాల విషయంలోనూ ఎస్సీ వర్గీకరణను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. రిజర్వేషన్ల అమలులో నిబంధనలను కఠినంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ), రిజర్వేషన్ల హేతుబద్ధీకరణపై తాజా ఉత్తర్వులు జారీ చేసింది. 2026 అక్టోబర్ 26న ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి బోయి విజయేంద్ర జారీ చేశారు. దీనిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పదోన్నతులు, బదిలీలు , విద్యాసంస్థల్లో ప్రవేశాలు వంటి అన్ని విషయాల్లో ఎస్సీ వర్గీకరణను

మిగతా 2లో..

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు..

- ప్రభుత్వ అసమర్థ పాలనే దీనికి కారణం
- వర్షపాతం లోటు ఉన్నా రాష్ట్రంలోనే కరవు
- గతంలో వేసవిలోనూ ఎక్కడా నీటి కొరత లేదు
- ప్రస్తుతం సరైన ప్రణాళిక లేక పంట పొలాలు
- ఎకరాకు రూ.20,000 పరిహారం అందించాలి
- తాగునీటిపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఉండాలి
- ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే హోలిడే ఇవ్వాలి
- సాగునీటి నిర్వహణలో చంద్రబాబు భేష్
- బాబు దూరదృష్టిని అభినందిస్తున్నా..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న నీటి ఎద్దడి, కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థతలేని పాలన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం విలేకరుల సమావేశంలో పలు ఆసక్తికర విషయాలను మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల్లో నీటి యాజమాన్య పద్ధతులను ఉదాహరణగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. హైదరాబాద్‌లోనే కాదు, పొరుగు రాష్ట్రాల్లోనూ నీటి కొరత ఏ స్థాయిలో ఉందో వివరించేందుకు కేటీఆర్ ఒక ఉదాహరణ చెప్పారు. "ఇవాళ ఉదయం మా ఆవిడ నాతో ఒక విషయం చెప్పింది. మా ఇంటి ఎదురుగా నివసించే వ్యక్తికి విజయవాడ నుంచి వారి బంధువులు ఫోన్ చేశారు. విజయవాడలో కనీసం తాగడానికి, వాడుకోవడానికి కూడా నీళ్లు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీళ్ల కోసం హైదరాబాద్‌కే వచ్చేస్తామని వారు అన్నారట. విజయవాడ లాంటి ప్రదేశం నుంచే హైదరాబాద్‌కు రావలసి వస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని కేటీఆర్ పేర్కొన్నారు. కరవు పరిస్థితులు ఎదురైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి నిర్వహణను సమర్థవంతంగా చేపడుతున్న తీరుపై ఏపీ సీఎం చంద్రబాబును కేటీఆర్

మిగతా 2లో..

నేను అలా మాట్లాడాల్సింది కాదు

కేటీఆర్‌కు కొండా సురేఖ క్షమాపణ

కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో గతంలో తీవ్ర దుమారం రేపిన వ్యాఖ్యల వివాదానికి ఎండ్ కార్డ్ వేసే దిశగా కాంగ్రెస్ నాయకురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ అనూహ్యంగా వెనక్కి తగ్గారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుపై తాను గతంలో చేసిన నిరాధారమైన, తీవ్ర వ్యక్తిగత విమర్శలను

మిగతా 2లో..

టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన..

102 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్

మిగతా 2లో..

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర!?

- కట్ట సమీపంలో బ్లాస్టింగ్ ఆపండి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. పేలుళ్లతో కట్టకు ప్రకంపనలు వస్తున్నాయని, సమీపంలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసి, కట్ట భద్రతపై అధికారులు

మిగతా 2లో..

డిజిటల్ మోసాలకు బ్యాంకులే జవాబుదారీగా చేయాలి

- బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా ఉండాలి
- డిజిటల్ మోసాలకు విద్యావంతులు బలౌతున్నారు
- బ్యాంకులకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్ తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి,

మిగతా 12లో..

నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన..

- ఇండియా కూటమి సర్వం సన్నద్ధం
- రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం
- నిరసన వాయిదా ఉండదన్న ఖర్గే
- పోలీసుల లాఠీలకు ఎవరూ భయపడొద్దు
- నవంబర్1న ర్యాలీకి భారీగా తరలిరండి
- దేశ ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని

మిగతా 2లో..

550 ఎకరాలు సర్కార్‌వే!

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట
- మియాపూర్ భూముల కేసులో సుప్రీం తీర్పు
- తీర్పుతో 23 ఏళ్ల భూ వివాదానికి పడిన తెర

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): హైదరాబాద్ లో కోట్లాది రూపాయల విలువైన మియాపూర్ భూముల దావాలో తెలంగాణ ప్రభుత్వానికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో చారిత్రాత్మక విజయం దక్కింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న దాదాపు 550 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిపై ప్రైవేట్ వ్యక్తులు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు

మిగతా 12లో..

హైదరాబాద్‌లో భారీ స్కామ్..

సన్న బియ్యం పేరుతో రేషన్ బియ్యం విక్రయాలు

తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి..

హైదారాబాద్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా.. ఆ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి, బ్రాండెడ్ కంపెనీల పేర్లతో అధిక ధరలకు విక్రయిస్తున్నారా.. హైదరాబాద్‌లో పలు రైస్ డిపోలపై అధికారులు నిర్వహించిన తనిఖీలతో ఈ ప్రశ్నలు తెరపైకి

మిగతా 12లో..

సంపాదకీయం

బియ్యం ధర పైపైకి..

ఓ వైపు ఎల్ నినో పై చర్చ జరుగుతుంటే మరోవైపు గుట్టుగా నిత్యవసర సరుకుల ధరలు మార్కెట్లో గణనీయంగా పెంచుతున్నారు. ముఖ్యంగా బియ్యం ధరలకు అడ్డుఅదుపు లేకుండా పెంచేశారు. హైదరాబాద్ మాత్రమే కాదు, విజయవాడలో బియ్యం ధరలను పరిశీలిస్తే, అక్టోబర్ 13 మంగళవారం నాటికి 26 కేజీల బస్తా 2వేలు దాటింది. ఆన్‌లైన్‌లో కూడా కిలో బియ్యం 82-83 రూపాయల వరకూ ఉంది. ఇక కందిపప్పు ధరలో సుమారు 15 శాతం పెరుగుదల కనిపించింది. 15 రోజుల కిందట కిలో 120-130 మధ్య ఉన్న కందిపప్పు ఇప్పుడు 150-160 వరకూ చేరింది. వీటితో పాటు కూరగాయల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. అయితే ఆ మార్పు ఒక్కసారిగా కనపడలేదు. ధరలు ఇంత తీవ్రంగా పెరగడానికి కారణమేంటి అని చూస్తే... వర్షాలు లేకపోవడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు కొందరు వ్యాపారులు. వర్షాలు సరిగా కురవలేదు కాబట్టి పంట తగ్గి, ధరలు పెరగడం వాస్తవం. పప్పు దినుసులు, ఇతర కిరాణా సరకులు మన దగ్గర 10-15శాతం వరకూ పెరిగాయి. వర్షాభావం కొనసాగితే ఇంకా పెరిగే అవకాశం ఉంది. పంచదార రూ.42కి వచ్చి మళ్లీ రూ.50 అయింది. ఇంకా పెరిగే అవకాశం బాగా ఉంది. వానల పరిస్థితి ఇలా ఉంటే అన్ని వస్తువుల ధరలూ 20-25 శాతం పెరుగుతాయి. ప్రస్తుతానికి కొనుగోళ్లపై ప్రభావం పడలేదు. కానీ పరిస్థితి ఇలానే ఉంటే, అంటే ధరలు 25 శాతం కనుక పెరిగితే, ఖచ్చితంగా కొనుగోళ్లపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో 2026 జూన్--ఆగస్టు మధ్య కురవాల్సిన వర్షం దాదాపు సగమే కురిసింది. దీంతో పెద్ద సంఖ్యలో కరవు మండలాలను ప్రకటించారు. అయితే వర్షాభావం వల్ల వరి ఉత్పత్తి కాస్త తగ్గినప్పటికీ, మరీ ఘోరంగా ఉత్పత్తి పడిపోలేదని ప్రభుత్వ గణాంకాలు చూస్తే తెలుస్తుంది. 2026 జూన్--ఆగస్టు మధ్య ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 53.4 శాతం లోటు నమోదైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 21 జిల్లాల్లోని 388 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. తెలంగాణలో ఇదే కాలానికి వర్షపాతం లోటు 17 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో సుమారు 200కి పైగా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల గణాంకాలు, అంచనాల ప్రకారం 2024 ఖరీఫ్‌లో 78 లక్షల 28 వేల 460 టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. ఇక 2025 ఖరీఫ్‌లో ఆ ఉత్పత్తి 94 లక్షల 91 వేల టన్నులు కాగా, 2026 ఖరీఫ్‌కి 66 లక్షల 76 వేల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. అంటే ఈ ఏడాది ఉత్పత్తి తగ్గుతోందని తెలుస్తోంది. కానీ మొత్తంగా పూర్తిగా వరి ఉత్పత్తి ఆగిపోయే పరిస్థితి లేదు. గతేడాది వరి ఉత్పత్తి బాగా ఉన్నప్పటికీ , ప్రస్తుతం చేనులో ఉన్న వరి ఉత్పత్తి ఆధారంగా మార్కెట్లో ధరలు పెరగడం ఆసక్తికర పరిణామం. వ్యాపారులు, మిల్లర్లు గతంలో ఎప్పుడో రైతుల దగ్గర సాధారణ ధరకు కొన్న సరకును ప్రస్తుతం అత్యధిక ధరకు అమ్ముతున్నారన్నది పరోక్షంగా వినిపిస్తున్న ఆరోపణ. మరోవైపు సామాన్యులపై ధరల భారం పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించింది ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ. మరోవైపు ధరల పెరుగుదలపై చర్చ వచ్చిన సమయంలోనే మరో ఆసక్తికరమైన చర్చ ప్రారంభమైంది. సామాన్యులకు ధరలు పెరిగినట్టు కనిపించినప్పటికీ, రైతులకు ఇది లాభమేనని కొందరు సోషల్ మీడియా వేదికగా చర్చిస్తున్నారు. అయితే ప్రస్తుతం దుకాణాల్లో అమ్ముతున్న బియ్యం, రైతుల దగ్గర నుంచి కొని కనీసం ఆరు నెలల నుంచి మూడేళ్లకు పైగా అయి ఉంటుంది. అప్పుడు కొన్న ధరకు, ఆ తర్వాత మిల్లింగ్, ప్యాకింగ్ ప్రాసెస్ కానీ, మధ్యవర్తులు, డీలర్లు, మిల్లర్ల లాభం కానీ కలుపుకున్నా, ఇంత ధర రాదు. ప్రస్తుతం మార్కెట్లో అమ్ముడవుతున్న సరకు వల్ల రైతుకు ప్రత్యక్షంగా లాభం లేదు. అయితే, ఆ ప్రభావం, ప్రస్తుత పంట కొనుగోళ్లపై పడింది. అప్పట్లో అత్యంత చవకగా రైతుల దగ్గర కొన్న ధాన్యం.. బియ్యంగా మారి ఇప్పుడు రెట్టింపు ధరకు వినియోగదారులకు అందుతోంది. రెండు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం వరి కోతల సమయం నడుస్తోంది. అక్కడ ప్రభుత్వం నిర్ధరించిన గిట్టుబాటు ధర కంటే, మిల్లర్లు అధిక ధర చెల్లించి వారి వద్ద ధాన్యం కొంటున్నారు. క్వింటాలుకు కనీసంగా 500 రూపాయల నుంచి వివిధ మొత్తాల్లో రైతులకు ఎక్కువ చెల్లిస్తున్నారు. ఆ మేరకు రైతులకు లబ్ధి జరుగుతోంది. కానీ ఇది ఎంత కాలం సాగుతుంది? ఎంత పంట ఆ రీతిలో కొంటారు? అన్నది స్పష్టత లేదు. ఏది ఏమైనా ఇష్టారీతిన వ్యాపారులు పెంచుతున ధరలకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే పస్తులే శరణ్యమని వేడుకుంటున్నారు. మరి దీనిపై అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా? వేచి చూడాల్సిందే.

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర!?

మొదటిపేజీ తరువాయి..

సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు వంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలో పేలుళ్లు జరపాల్సి ఉండగా, 200 మీటర్ల దూరంలోనే జరుగుతున్నాయని మండిపడ్డారు. రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ భూసేకరణలో అసైన్డ్ భూముల రైతులకు తక్కువగా, పట్టా భూముల రైతులకు ఎక్కువగా పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్షించి న్యాయం చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. తిప్పారం గ్రామం వద్ద పైప్‌లైన్ల పనుల కోసం జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతిన్నాయని, మల్లన్నసాగర్ కట్టకూ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌తో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు దెబ్బతిన్నవారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన..

మొదటిపేజీ తరువాయి..

స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బుధవారం ప్రకటన జారీ చేసింది. 102 ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు అర్హత ఉన్నవారు అప్లై చేసుకోవాలని సూచించింది. పరీక్ష జనవరిలో జరిగే అవకాశం ఉందని, 7 రోజుల ముందుగానే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తామని ఓ ప్రకటనలో తెలిపింది. ఆఖరి తేదీ వరకు వేచి ఉండకుండా, అభ్యర్థులు ముందుగానే అప్లికేషన్లను సమర్పించాలని ఈ సందర్భంగా సూచించింది. స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా డిగ్రీ కోర్సు చేసిన వారు ఈ పోస్టులకు అప్లై చేసుకోవచ్చని పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1000 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించింది. అభ్యర్థుల వయసు 2026 జులై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్లు మించరాదని ప్రకటనలో పేర్కొంది. ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా వయో పరిమితిలో ప్రత్యేక సడలింపు ఉంటుంది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వేతన పే స్కేలు రూ.36,750 - రూ.1,06,990గా ఉంటుందని తెలిపింది. ఇక నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షల విధానంలో గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలు జరుగుతాయని టీజీపీఎస్సీ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు.

నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన..

మొదటిపేజీ తరువాయి..

ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు. పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు. మరొవైపు చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. కాగా మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్ సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్ పార్లమెంట్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది. సర్ అనేది దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును లాక్కోవడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పన్నిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేశారని విమర్శించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ా×=ను నిలిపివేయాలని, ఈసీఐనెట్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఎస్ఐఆర్ పూర్తయిన లేదా కొనసాగుతున్న కనీసం ఆరు రాష్ట్రాల్లో, ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత విదేశీయుల సంఖ్య సుమారుగా 1,600 మంది ఓటర్లతో పోలిస్తే చాలా తక్కువ అంటూ పేర్కొన్న మీడియా నివేదికను పోస్ట్ చేశారు.

నేను అలా మాట్లాడాల్సింది కాదు

మొదటిపేజీ తరువాయి..

బేషరతుగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె ఎక్స్ వేదికగా బహిరంగ ప్రకటన చేశారు. ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో విమర్శలు చేశానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదని, కేటీఆర్‌ను గానీ ఆయన కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే చింతిస్తున్నానని పేర్కొన్నారు. అయితే, సడన్‌గా సురేఖ దిగివచ్చి విచారం వ్యక్తం చేయడం వెనుక రాజకీయం కంటే పక్కా లీగల్ ప్లాన్ దాగి ఉందని భావిస్తున్నాయి. ఈ అకస్మాత్తు క్షమాపణ వెనుక ప్రజాప్రతినిధుల కోర్టులో వేలాడుతున్న క్రిమినల్ పరువు నష్టం కేసుల ముప్పు తప్పించుకునే తీవ్ర ప్రయత్నమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. నాడు సినీ నటులు నాగచైతన్య, సమంత విడాకుల అంశాన్ని డ్రగ్స్ వ్యవహారాలతో ముడిపెడుతూ కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత నాంపల్లి కోర్టులో సవాల్ చేశారు. ఆధారాల్లేకుండా ఒక మంత్రి హోదాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడటంపై కోర్టు క్రిమినల్ ప్రొసీడింగ్స్ స్వీకరించి, నేరం రుజువైతే జైలు శిక్ష పడే అవకాశం, ప్రజాప్రతినిధిగా అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటంతో.. శిక్ష నుంచి తప్పించుకోవడానికి అపోలజీ కార్డ్ అనే న్యాయ రక్షణ అస్త్రాన్ని సురేఖ ప్రయోగించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి నాంపల్లి కోర్టు మెట్లు ఎక్కకుండా కొండా సురేఖ ఇలాంటి దౌత్యంతో వెనక్కి తగ్గడం ఇది రెండోసారి. ఇదే వివాదంలో అక్కినేని నాగార్జున వేసిన దావా విచారణ తీవ్రరూపం దాల్చి, కోర్టు స్వయంగా నోటీసులు జారీ చేసిన తరుణంలో.. అర్థరాత్రి వేళ నాగార్జున కుటుంబానికి క్షమాపణలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి కేసును శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ అమలు

మొదటిపేజీ తరువాయి..

కచ్చితంగా, ఎటువంటి వైవిధ్యం లేకుండా అమలు చేయాలని అన్ని శాఖలు, విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్, స్వయంప్రతిపత్తి సంస్థలకు ఆదేశించారు. సుప్రీంకోర్టు 2024లో ఎస్సీ/ఎస్టీలలో ఉప-వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు అధికారం ఇచ్చిన తర్వాత తెలంగాణ దేశంలోనే మొదటి రాష్ట్రంగా దీన్ని అమలు చేసింది. 2025 మార్చిలో అసెంబ్లీ ఆమోదించి, ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం తెలిపారు. ఏప్రిల్ 14, 2025న (అంబేద్కర్ జయంతి) గెజిట్ నోటిఫికేషన్,సంబంధిత జీవోలు విడుదలయ్యాయి. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించారు. మొత్తం ఎస్సీ రిజర్వేషన్ 15%లోనే ఇది అమలవుతుంది (హేతుబద్ధీకరణ). కొన్ని శాఖలు, విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లు అమలులో స్పష్టత లేకపోవడం లేదా పదోన్నతుల్లో సరిగా పాటించకపోవడంతో మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఇతర ఎస్సీ సంఘాలు ప్రాతినిధ్యాలు ఇచ్చాయి. 2025 నవంబర్ 25న ఇచ్చిన మెమోను మరోసారి గుర్తు చేస్తూ కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇవి డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం శాఖలకు, ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌కు, అన్ని కలెక్టర్లకు, సంబంధిత సంస్థలకు పంపబడ్డాయి. జనరల్ అడ్మినిస్ట్రేషన్ (సర్వీసెస్) శాఖ కూడా అవసరమైన సూచనలు జారీ చేయాలని కోరారు. ఈ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత జారీ అయ్యే నియామకాలు, ప్రవేశాలకు మాత్రమే వర్తిస్తుంది, (గత నోటిఫికేషన్లకు కాదు). ఖాళీలు నింపకపోతే ఇతర కమ్యూనిటీలకు ఇవ్వకుండా క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. 2026 జనాభా లెక్కల తర్వాత ఎస్సీ జనాభా పెరిగితే మొత్తం రిజర్వేషన్ శాతం పెంచే అవకాశం ఉందని ప్రభుత్వం చెప్పింది (ప్రస్తుతం 2011 జనాభా ఆధారంగా 15%). ఈ ఉత్తర్వులు ఎస్సీలలో అంతర్గత సమానత్వం, వెనుకబడిన ఉపకులాలకు న్యాయం చేయడం లక్ష్యంగా ఉన్నాయి. మరిన్ని వివరాలకు అధికారిక గెజిట్ లేదా ఎస్సీ అభివృద్ధి శాఖ నోటిఫికేషన్లను చూడవచ్చు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు..

మొదటిపేజీ తరువాయి..

అభినందించారు. ఏపీలో ఎత్తిపోతల పథకాల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు అందించడంలో చంద్రబాబు దూరదృష్టితో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల్లో నమోదైన వర్షపాతం గణాంకాలను కేటీఆర్ పోల్చి చెప్పారు. ఏపీలో సుమారు 35%, కర్ణాటకలో 30% వర్షపాతం లోటు నమోదైనప్పటికీ, సరైన నీటి యాజమాన్యం వల్ల అక్కడ కరవు పరిస్థితులు రాకుండా చూసుకోగలిగారు. కానీ, తెలంగాణలో కేవలం 17% నుండి 25% లోటు మాత్రమే ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇక్కడ కరవు ప్రకటించాల్సిన దుస్థితికి తెచ్చింది. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా వేసవిలోనూ ఎక్కడా నీటి కొరత లేకుండా చూసుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేక పంట పొలాలను ఎండబెడుతోందని కేటీఆర్ విమర్శించారు. నీరు అందక ఎండిపోయిన పంటలకు తక్షణమే

ఎకరాకు రూ.20,000 చొప్పున పరిహారం అందించాలని, తాగునీటి సరఫరాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్, ఇప్పుడేమో రైతుల సెల్ఫ్ డిక్లరేషన్. తమ పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో ఏర్పడింది. జెనరేటర్లు, ట్యాంకర్లతో తెలంగాణ రైతులు పంటలు కాపాడుకుంటున్నారు. క్రాప్ హాలిడే ప్రకటించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ఇవ్వాలి. ఇది కాలం తెచ్చిన కరవు కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరవు..రేవంత్ రెడ్డి మనపై రుద్దుతున్న కరవు. 4 నెలల ముందే మేమంతా హెచ్చరించినా వినకుండా.. గోదావరిలోని 750 టీఎంసీలు, కృష్ణాలోని 250 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలేసి, కరవుకు కారణమయ్యిందు. రాష్ట్రంలో ఒకవైపు ప్రభుత్వం కరవు ఉందని చెబుతూనే, మరోవైపు మూసీ సుందరీకరణ చేస్తాడట. మూసీ ప్రాజెక్ట్ బాధితుల కోసం పబ్లిక్ హియరింగ్ పెడితే బీఆర్ఎస్ మాజీ మంత్రులను, ఎమ్మెల్యేలను, నాయకులను హౌస్ అరెస్ట్ చేశారన్నారు. మాజీ మంత్రి కొండా సురేఖ గతంలో కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంపై కేటీఆర్ స్పందించారు. "నిజం నిలకడ మీదే తేలుతుంది. మొన్న ఒక వార్తాపత్రిక క్షమాపణ చెప్పింది.. ఈరోజు ఈ మేడం చెప్పారు. ఇంకా క్షమాపణలు చెప్పే వాళ్లు చాలా మంది ముందు వరుసలో ఉన్నారు. మా మీద ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేసే వారు భవిష్యత్తులో వరుసగా క్షమాపణలు చెప్తారు" అని కేటీఆర్ అన్నారు.

పూర్తి సహకారం

మొదటిపేజీ తరువాయి..

విధాన నిర్ణేతలు, అధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారుల కోసం పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విధాన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు నాలుగు వందల ఏళ్ల క్రితమే ప్రపంచ నగరంగా గుర్తింపు ఉందని సీఎం తెలిపారు. ప్రపంచీకరణ అనే మాట ప్రాచుర్యంలోకి రాకముందే అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. చార్మినార్ పరిసరాల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, నఖాసీ వస్తువుల వ్యాపారం జరిగేదని గుర్తు చేశారు.నిజాం పాలనలో హైదరాబాద్‌లో అనేక చారిత్రక కట్టడాలు, అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలు, టంకశాల, విమానాశ్రయం, రైల్వే వ్యవస్థ, విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్), అజయ్ బంగా (ప్రపంచ బ్యాంకు), శంతను నారాయణ్ (అడోబ్), ప్రేమ్ వత్స వంటి వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను అందించడంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు సీఎం తెలిపారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న తరుణంలో దేశాభివృద్ధికి బాటలు వేసిన నాయకులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ కంప్యూటర్, టెలికం రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి పునాది వేసిందని సీఎం కొనియాడారు. నేడు ఫోన్, ఇంటర్నెట్ లేని జీవితం ఊహించలేని పరిస్థితి ఏర్పడిందంటే అందుకు ఆనాటి సంస్కరణలే కారణమన్నారు. రాజీవ్‌గాంధీ హైదరాబాద్‌లో పైలట్ శిక్షణ పొందారని, అందుకే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామని సీఎం తెలిపారు. 1991లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చారని సీఎం తెలిపారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపారని వివరించారు. హైదరాబాద్ జీవన విధానంలోనే ప్రపంచ దృక్పథం ఉందని, సంస్కరణలు, పారిశ్రామిక అభివృద్ధి, వ్యాపార స్ఫూర్తి తెలంగాణ ప్రజల జీవన విధానంలో భాగమని రేవంత్‌రెడ్డి అన్నారు. 1991 నుంచి వివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ లో పెట్టుబడులకు అన్ని ప్రభుత్వాలు తమవంతు సహకారం అందించాయని తెలిపారు.ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు ద్వారా పెట్టుబడిదారుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి వచ్చానని అంతర్జాయతీ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యాపార, వాణిజ్య రంగంలో పారిశ్రామికవేత్తలకు తమకంటే ఎక్కువ అనుభవం ఉందని, వారి నుంచి నేర్చుకుని, సూచనలను అర్థం చేసుకుని అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్న పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడి మొత్తాన్ని, వ్యాపార వృద్ధిని, లాభాల అంచనాలను రెట్టింపు చేయాలని కోరారు.పారిశ్రామికవేత్తలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం నుంచి ఏం కావాలో చెప్పాలని, విధానపరమైన మార్పుల నుంచి అవసరమైన సహకారం వరకు అన్నింటినీ అందించేందుకు వ్యక్తిగతంగా తాను బాధ్యత తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యం వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సమయంలో దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం వివరించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సీఎం ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకు సందేహాలు ఉండొచ్చని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరుకావడమే ఇందుకు నిదర్శనమని సీఎం తెలిపారు.

దరఖాస్తుకు ముందే డిజిలాకర్, కేవైసీ రెడీ చేసుకోవాలి

మొదటిపేజీ తరువాయి..

నేపథ్యంలో, విద్యార్థులు అప్లికేషన్ నింపేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ సలహాలు పాటించాలని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ముఖ్యంగా డిజిలాకర్ ఆధారాలను, ఇతర ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. "జేఈఈ మెయిన్ 2027 అభ్యర్థులు తమ ప్రయాణాన్ని సజావుగా ప్రారంభించేందుకు, దరఖాస్తు నింపడానికి ముందే మూడు విషయాలు సిద్ధంగా ఉంచుకోవాలి" అని ఎన్టీఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. విద్యార్థులు తమ సొంత డిజిలాకర్/జనప్రిచయ్ వివరాలనే వాడాలని, డిజిలాకర్ రీ-కేవైసీని ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. అలాగే, దరఖాస్తులో నింపే పేరు, పుట్టిన తేదీ వివరాలు పదో తరగతి సర్టిఫికెట్‌లోని వివరాలతో కచ్చితంగా సరిపోలాలని స్పష్టం చేసింది. "జాగ్రత్తగా దరఖాస్తు చేసి, మీ ఉత్తమ ప్రదర్శన ఇవ్వండి!" అని ఎన్టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్ 2027 కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 24న ప్రారంభం కాగా, నవంబర్ 22 వరకు కొనసాగుతుంది. తొలి విడత (సెషన్ 1) పరీక్షలు 2027 జనవరి 20, 21, 22, 23, 24, 28 తేదీల్లో పలు షిఫ్టులలో నిర్వహిస్తారు. ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించడానికి నవంబర్ 26 చివరి తేదీ. డిసెంబర్ 30న అభ్యర్థులకు పరీక్షా కేంద్రం ఉన్న నగరం వివరాలను వెల్లడించి, 2027 జనవరి 13 నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. జేఈఈ మెయిన్‌లో రెండు పేపర్లు ఉంటాయని ఎన్టీఏ తెలిపింది. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పేపర్ 1 నిర్వహిస్తారు. ఐఐటీలలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఇది అర్హత పరీక్షగా కూడా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా బీ.ఆర్క్, బీ.ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పేపర్ 2 నిర్వహిస్తారు. 2027-28 విద్యా సంవత్సరానికి గానూ జేఈఈ మెయిన్ పరీక్షలను రెండు సెషన్లలో, అంటే 2027 జనవరి, 2027 ఏప్రిల్ లలో నిర్వహించనున్నట్లు ఎన్టీఏ వెల్లడించింది.

నీటి దుర్వినియోగాన్ని అరికట్టేలా చర్యలు

మొదటిపేజీ తరువాయి..

భూగర్భ జలాలు, రాబోయే ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన (పానీ) మొబైల్ యాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పరిరక్షణ, నీటి పునర్వినియోగం, భవిష్యత్తు తాగునీటి అవసరాలపై మాట్లాడారు. తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేవలం అధికారుల పర్యవేక్షణ సరిపోదని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. నగరంలోని ప్రతి ప్రాంతంలో జరుగుతున్న నీటి వృథాను గుర్తించేందుకు ప్రజల సహకారం తీసుకోవాలనే ఉద్దేశంతో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నీటి దుర్వినియోగానికి పాల్పడేవారిపై జరిమానాలు విధించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం కాదని, అలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన, బాధ్యత పెంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముందుగా అవగాహన కల్పిస్తామని, అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజ హితం కోరుకునే ప్రతి ఒక్కరూ వాటర్ వాలంటీర్‌గా నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. పాత్రికేయులు, ఆర్టీఐ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, యువతతో పాటు ఆసక్తి ఉన్న పౌరులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చన్నారు. తమ పరిసరాల్లో తాగునీటి వృథా, దుర్వినియోగం జరుగుతున్నట్లు గుర్తిస్తే యాప్ ద్వారా జలమండలి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన సమాచారంపై అధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపడతారని తెలిపారు. నీటి సంరక్షణలో చురుగ్గా పాల్గొనే వాలంటీర్ల సేవలను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం ఆందోళనకరమని మంత్రి పేర్కొన్నారు. వర్షాల సమయంలో రహదారులు జలమయమవుతున్నా, ఆ నీటిని భూమిలోకి ఇంకించే వ్యవస్థలు తగినంతగా లేకపోవడం వల్ల విలువైన జలవనరులు వృథా అవుతున్నాయని తెలిపారు. గతంలో గ్రామాల్లో చెరువులు, బావులు, సహజ నీటి నిల్వ వ్యవస్థల ద్వారా భూగర్భ జలాలు సంరక్షించబడేవని గుర్తుచేశారు. ప్రస్తుతం నగర విస్తరణ, కాంక్రీటు నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాల పెరుగుదలతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయని వివరించారు. రాబోయే ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే భూగర్భ జలాల తగ్గుదల, ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ వంటి అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. నీటి వనరులను పెంచుకోవడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, నీటి వృథాను తగ్గించడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలను సమాంతరంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.జలమండలి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆసక్తి ఉన్న పౌరులు వాటర్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవచ్చు. నమోదు ధ్రువీకరణ అనంతరం యాప్ ద్వారా నీటి దుర్వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు అందించవచ్చు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, సింగూరు- మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోవడంతో రాబోయే వేసవిలో తాగునీటి సరఫరాకు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం నగరానికి రోజుకు 560 నుంచి 570 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, భూగర్భ జలాలు తగ్గడంతో ట్యాంకర్ల డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని తెలిపారు.

పోతారంలో పెద్ద భీమన్న స్వామి జాతర

నవంబర్ 1, 2 తేదీల్లో వైభవంగా ఉత్సవాలు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)

శ్రీ శ్రీ శ్రీ పెద్ద భీమన్న స్వామి జాతరను నవంబర్ 1, 2 తేదీల్లో రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు గ్రామీణాభివృద్ధి కమిటీ, భీమన్న కమిటీ, గ్రామ పరిపాలన అధికారులు, గ్రామ ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లె పర్యటన, గ్రామంలోని ప్రతి ఇంటికి దర్శనం,

గంగాస్నానం, సాంస్కృతిక కార్యక్రమాలు, మొక్కుల చెల్లింపు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జాతరలో భాగంగా పోతారం గ్రామం నుంచి భీమన్న స్వామివారు పల్లెలు, గ్రామాలకు బయలుదేరి తిరిగి శనివారం పోతారం గ్రామానికి చేరుకుంటారు. అనంతరం ఆదివారం గ్రామంలోని ప్రతి ఇంటికి స్వామివారి దర్శనం కల్పిస్తారు. అదే రోజు సాయంత్రం గంగాస్నానానికి తీసుకెళ్తారు. రాత్రి 8 గంటల నుంచి ఆలయం వద్ద డ్యాన్స్ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం మేడిగుంది భీమన్న స్వామి ఆలయం వద్ద బండారు బసంతం కార్యక్రమం నిర్వహించిన అనంతరం భక్తులు తమ మొక్కులు చెల్లించుకోనున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నేరడిగొండ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):

బోథ్ ఎక్స్ రోడ్డు గుండా ప్రయాణించే వేలాది మంది ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను గురువారం స్థానిక

శాసనసభ్యులు అనిల్ జాదవ్ నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణ పనుల వేగం, నాణ్యతపై అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి, వీలైనంత త్వరలోనే ఈ మరుగుదొడ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అలాగే, రాత్రి వేళల్లో ప్రయాణికులకు, స్థానికులకు చీకటి సమస్య లేకుండా ఇటీవల బోథ్ ఎక్స్ రోడ్డు జంక్షన్ వద్ద హైమాస్ వెలుగులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. నియోజకవర్గంలో ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్ గులాబ్, దేవేందర్ రెడ్డి, వెంకట్రావు, సుజీల్, గాడ్గే సుభాష్‌లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతి గోడపత్రాల ఆవిష్కరణ

తిర్యాణి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): ఆదివాసీ బిరుదు గోండు కళాతపస్వి వెడ్మ రాము వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను గురువారం తిర్యాణి మండల కేంద్రంలోని కొమురం భీం చౌరస్తాలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ కళా

సాంస్కృతిక రంగానికి విశేష సేవలందించిన వెడ్మ రాము వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 30న ఏదులాపాడు గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలు, వెడ్మ రాము అభిమానులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

అన్నదాతకు తప్పని కష్టాలు.. అడవి పందుల దాడితో పత్తి పంట ధ్వంసం!

నేరడిగొండ మండలం బోరిగాంలో తీవ్ర నష్టపోయిన రైతు కుటుంబం

నేరడిగొండ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అన్నదాతలకు కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక, నీటి

కొరతతో పంటల ఎదుగుదల మందగిస్తుండగా.. మరోవైపు అడవి జంతువుల దాడులు రైతులను నిండా ముంచుతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలు ప్రకృతి వైపరీత్యాలు, అడవి పందుల ఉద్ధృతికి నేలకూలుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోరిగాం గ్రామానికి చెందిన రాథోడ్ సందీప్, చాంగుబాయి రైతు కుటుంబం ప్రస్తుతం ఇదే దుస్థితిని ఎదుర్కొంటోంది.

పెట్టుబడుల భారం.. దిగుబడిపై ఆందోళన:

బోరిగాం గ్రామానికి చెందిన రాథోడ్ సందీప్, చాంగుబాయి దంపతులు తమ వ్యవసాయ భూమిలో ఆశలతో పత్తి సాగు చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కోసం వేలాది రూపాయలు అప్పు చేసి మరీ ఖర్చు చేశారు. అయితే, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంట ఎదుగుదల మందగించింది. ఈ తరుణంలో దిగుబడి తగ్గుతుందో ఏమోనని ఆందోళన చెందుతున్న ఆ రైతు దంపతులకు, అడవి పందుల రూపంలో మరింత పెను ముప్పు వచ్చిపడింది.

ఎకరానికి పైగా పత్తి పంట ధ్వంసం:

సమీప అటవీ ప్రాంతం నుంచి వచ్చిన అడవి పందుల గుంపు ఒక్కసారిగా పత్తి చేనుపై దాడి చేసింది. పొలంలో విచ్చలవిడిగా సంచరిస్తూ పత్తి మొక్కలను తొక్కి, విరిచి, పీకివేయడంతో కాయలతో ఉన్న కొమ్మలు నేలకొరిగాయి. ఈ దాడిలో ఎకరానికి పైగా విస్తీర్ణంలో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతులు వాపోయారు. మరోవైపు కోతుల బెడద కూడా రోజురోజుకూ పెరుగుతుండటంతో పంటలను కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అటవీ శాఖకు వినతిపత్రం:

అడవి పందుల దాడితో వాటిల్లిన తీవ్ర నష్టంపై స్పందించాలని కోరుతూ బాధిత రైతు చాంగుబాయి అక్టోబర్ 28న అటవీ శాఖ రేంజ్ అధికారికి అధికారికంగా వినతిపత్రం సమర్పించారు. దెబ్బతిన్న పత్తి పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పంట నష్టంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి.. రక్షణ కల్పించాలి:

సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆ రైతు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. సంబంధిత అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హమైన పరిహారం అందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అడవి పందులు, కోతుల బెడదను నివారించేందుకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వర్షాభావం, అడవి జంతువుల దాడుల మధ్య సర్వస్వం కోల్పోతున్న తమలాంటి పేద రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి):

నిర్మల్ జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలని, స్పోర్ట్స్ అరీనాలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ నిర్మల్ పట్టణ, గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించి వివిధ సంస్థలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. సోఫీనగర్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన భద్రతతోపాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెమిస్టర్ పరీక్షల సమయానికి సిలబస్ పూర్తిచేయడంతో పాటు, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఎంఈసీ విభాగం విద్యార్థులతో మాట్లాడి విద్య, భోజనం, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారిని అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు,

ఉపాధ్యాయులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యనగర్‌లోని స్పోర్ట్స్ అరీనాను పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని, క్రీడలు ఆడేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. షటిల్ బ్యాడ్మింటన్, పికిల్‌బాల్ కోర్టుల పరిసరాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. మహాలక్ష్మీవాడ సమీపంలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, జంతువుల స్టెరిలైజేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఖానాపూర్, భైంసా ప్రాంతాల్లోనూ అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డంప్ యార్డును పరిశీలించిన కలెక్టర్, తడి, పొడి చెత్త వేర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని,

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. గండిరామన్న నుంచి కమలానగర్ వరకు చేపడుతున్న అటవీ, రెవెన్యూ భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అటవీ, రెవెన్యూ శాఖల భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ భూముల సరిహద్దుల నిర్ధారణకు, భవిష్యత్తులో వివాదాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో డివిఎహెచ్ఓ సురేష్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు రాజు, ప్రభాకర్, మున్సిపల్ డీఈ హరిభువన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం!

మరమ్మతులు చేపట్టాలని ఉపసర్పంచ్ పవన్ కుమార్ విజ్ఞప్తి

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి :

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం

అందిస్తున్న మోతుగూడ అంగన్‌వాడీ కేంద్రం-1 భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించాలని ఉపసర్పంచ్ పవన్ కుమార్ కోరారు. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడలో జాడి అనిత నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉపసర్పంచ్ పవన్ కుమార్ సందర్శించి, అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించే విషయంలో అంగన్‌వాడీ సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని

తెలిపారు. అయితే కేంద్రం నిర్వహిస్తున్న భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, ఎప్పుడు కూలిపోతుందోననే ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ అనుమతులతో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. చిన్నారులు, గర్భిణుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భవన సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సమ్మిళిత సాచురేషన్ క్యాంపెయిన్ నిర్వహణ

తిర్యాణి అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి) :

మండలంలోని గంబీరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ జుమ్మిడి కిష్టయ్య అధ్యక్షతన, తిర్యాణి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ వై. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళిత సాచురేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాలు, బ్యాంకింగ్ సేవలు, బీమా సదుపాయాలపై అవగాహన కల్పించారు.

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన వంటి పథకాల ప్రయోజనాలను వివరించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటూ ఆర్థిక భద్రతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు, బ్యాంకు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరువు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు.. రూ.50 వేల కోట్ల సాయం అందించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

ఆసిఫాబాద్, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి:

రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కరువు ప్రభావిత రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులను ఆదుకునేందుకు రూ.50 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి కుశాన రాజన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించి రాష్ట్రాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. వర్షపాతం గణనీయంగా తగ్గిందని, సుమారు ఆరు లక్షల బోర్లు నీరు లేక ఎండిపోయాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందన్నారు.

కరువు వల్ల నష్టపోయిన రైతులకు వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాను రెట్టింపు చేయడంతోపాటు ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.800 వేతనం చెల్లించాలన్నారు. రేషన్ లబ్ధిదారులకు బియ్యంతోపాటు పప్పు, చింతపండు సహా 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని, వాటిలో 10 ఉచితంగా, నాలుగు సబ్సిడీపై ఇవ్వాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. మహారాష్ట్రకు రూ.5 వేల కోట్లు కేటాయించి

తెలంగాణకు నిధులు ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలని సూచించారు. ఆరుతడి పంటల సాగుపై స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలని కోరారు. కరువు ప్రభావం గ్రామాల నుంచి పట్టణాలకు విస్తరించే ప్రమాదం ఉందని, ఉపాధి అవకాశాలు తగ్గకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు పేరుతో గిరిజనుల భూములను కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని జాన్ వెస్లీ హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులపై రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే బాధిత ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని తెలిపారు.తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారి రవికుమార్ మాట్లాడుతూ సాగులో ఉన్న రైతులకు భూ యాజమాన్యంతో సంబంధం లేకుండా పంట నష్టపరిహారం అందించాలని కోరారు. పెంబి నుంచి జన్నారం వరకు టైగర్ రిజర్వ్ పేరుతో గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులకు ఒక్క ఎకరానికీ పట్టా ఇవ్వలేదని విమర్శించారు. గిరిజనులపై దాడులు జరిగితే రైతులు, ప్రజలు ఐక్యంగా నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు వేతన ఒప్పందం, ఎన్నికల నిర్వహణ కోసం 130 రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని కోరారు. వారి పోరాటాలకు సీపీఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, రాజేందర్, ఆనంద్, కృష్ణమాచారి, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి సబ్‌స్టేషన్‌లో 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): మక్తల్ మండలం లింగంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు, ప్రస్తుతం ఉన్న 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను

తొలగించి, దాని స్థానంలో నూతనంగా 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మార్పు ద్వారా విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు, రైతులకు మరియు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్య చేపట్టడం జరిగిందని ఎస్ఈ నవీన్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ నవీన్ కుమార్, డీఈ శ్రీనివాసులు, ఎడి విజయ్ భాస్కర్, ఏఈ వెంకటేష్, ఏఈ శ్రీనివాస్, ఏఈ అశోక్ మరియు లైన్‌మెన్లు చంద్రకాంత్, సిద్దు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నిరంజన్‌రెడ్డిపై ఎస్పీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

- ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని వినతి

వనపర్తి, అక్టోబరు 29 (ప్రజాజ్యోతి): మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులపై చెప్పులతో దాడి చేస్తామంటూ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం జిల్లా ఎస్పీ డి.సునీతారెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్పీ

సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేసినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలు, యువత, రాజకీయ పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేలా ఉన్న వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ వ్యాఖ్యలను సుమోటోగా పరిగణించి, విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, కౌన్సిలర్లు పరుశురాములు, క్రాంతిగౌడ్, రాజుయాదవ్, నందిపేట తిరుపతయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జర్నలిస్టుల పురస్కారం-2026 అవార్డు అందుకున్న మీసాల ఎల్లేష్.

అవార్డు రావడం పట్ల మరింత బాధ్యత పెరిగింది.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.జర్నలిస్టుల జాతీయ పురస్కారం అందుకోవడంపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని, మీసాల ఎల్లేష్ అన్నారు. గురువారం నెల్లూరు జిల్లాలోని ఎం.వి. రావు

ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేసిన జాతీయ జర్నలిస్టుల పురస్కారం–2026ను దళిత్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్ అందుకున్నారు. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీల మోహన్ కృష్ణ, మాజీ డీఐజీ శ్రీనివాస్ చేతుల మీదుగా, మీసాల ఎల్లేష్ తో పాటు, దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, ప్రధాన కార్యదర్శి అంకూర్ డేవిడ్, వర్కింగ్ కార్యదర్శి ధనుష్ లు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మీసాల ఎల్లేష్ మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నందుకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మాగనూరు మండలంలో నాలుగు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మాగనూరు, అక్టోబర్ 29(ప్రజా జ్యోతి) తెలంగాణ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మాగనూరు మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఉజ్జల్లి, బైరంపల్లి, నేరడగం దొడ్డి, నేరేడుగం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఏ గ్రేడ్ వరికి రూ.2,961, ఇతర రకాల వరికి రూ.2,441 చొప్పున చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, వెలుగు సంఘాల అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు శంకర్ లింగం, బాలప్ప, అశోక్ గౌడ్, రామకృష్ణ, నాగరాజ్, వెలుగు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత సర్పంచులు,ప్రత్యేక అధికారులదే:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

గద్వాల అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి,మెరుగైన మార్కులు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఆదేశించారు.వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు.గురువారం గద్వాల మండలం కొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాలలో విద్యాబోధన,విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాలు,వర్క్‌బుక్స్ పంపిణీ,యూనిఫాంలు,పదో తరగతి ఫలితాలపై సమీక్షించారు.విద్యార్థుల ప్రస్తుత విద్యా ప్రమాణాలు,ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలను పరిశీలించారు.ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌తో పాటు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.గతంలో పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలుసుకున్న కలెక్టర్,ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేలా ముందస్తు ప్రణాళికతో బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ముఖ్యంగా గణితం,భౌతికశాస్త్రం వంటి సబ్జెక్టుల్లో ఆశించిన స్థాయిలో మార్కులు సాధించలేని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.విద్యార్థుల మార్కులను విశ్లేషించి,ఏ సబ్జెక్టులో,ఏ అధ్యాయంలో వెనుకబడి ఉన్నారో గుర్తించాలని సూచించారు.ప్రతి విద్యార్థికి ప్రత్యేక అభ్యసన ప్రణాళిక రూపొందించి,రోజువారీగా చదవాల్సిన అంశాలను తెలియజేయాలన్నారు.ఉదయం వేళల్లో చదువుకోవడం,ఇంటి వద్ద అభ్యాసం చేయడం,పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం,అసైన్‌మెంట్లు పూర్తి చేయడం వంటి అలవాట్లను పెంపొందించాలని చెప్పారు.సిలబస్‌ను నిర్ణీత గడువులో పూర్తి చేసి,పునశ్చరణకు తగిన సమయం

కేటాయించాలన్నారు.పరీక్షల పట్ల విద్యార్థుల్లో భయాన్ని తొలగించి,ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి విద్యార్థులు దసరా సెలవుల అనంతరం వెంటనే పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.కుటుంబ కార్యక్రమాలు,ఇతర కారణాలతో తరచూ గైర్హాజరు కాకూడదన్నారు.పాఠశాలకు రావడం మానేసిన లేదా తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి,వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు,రోజువారీ మెనూ,వంటకాల నాణ్యత,కూరగాయల వినియోగం,వంటశాల పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.నిర్ణీత మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, కేవలం అన్నం,సాంబారుతో సరిపెట్టకుండా మెనూలో పేర్కొన్న ఇతర వంటకాలను కూడా వడ్డించాలని ఆదేశించారు.పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడం బాధ్యతగా భావించాలన్నారు.వంట సిబ్బంది అందుబాటులో లేని సందర్భాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, సిబ్బంది కొరతను కారణంగా చూపి భోజన పంపిణీలో నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు.గురువారం నిర్ణీత మెనూ ప్రకారం వంట చేయకపోవడంతో సంబంధిత ఏజెన్సీని తొలగించి,కొత్త ఏజెన్సీని నియమించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.

యూనిఫాంలు,పాఠ్యపుస్తకాల పంపిణీపై ఆరా

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ,వాటి కొలతలు,కుట్టింపు,వినియోగంపై కలెక్టర్ ఆరా తీశారు.యూనిఫాంలు అందినప్పటికీ కొంతమంది విద్యార్థులు వాటిని ధరించకపోవడంపై ప్రశ్నించారు.ప్రతి విద్యార్థి యూనిఫాంలోనే పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.యూనిఫాంల కొలతలు సరిగా లేకపోతే అవసరమైన మార్పులు చేయించాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు.పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్,వర్క్‌బుక్స్ పంపిణీ వివరాలను తెలుసుకున్నారు.కొన్ని పుస్తకాలు,పార్ట్–2 పాఠ్యసామగ్రి ఇంకా అందాల్సి ఉందని ఉపాధ్యాయులు వివరించగా,విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అవసరమైన పుస్తకాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధులు,ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను తరచూ సందర్శించి పర్యవేక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి,వ్యవసాయానికి నీటి సరఫరా తదితర అంశాలపై గ్రామ సర్పంచ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ పర్యటనలో సర్పంచ్ కృష్ణారెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ,గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్,ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు

సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర

కపాస్ కిసాన్ యాప్‌తో స్లాట్ బుకింగ్‌కు అవకాశం

గద్వాల అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాలో పత్తి రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని,కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.రైతులు తమ పత్తిని ఇతర జిల్లాలకు తరలించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే విక్రయించుకునే అవకాశాలను ప్రోత్సహించాలని సూచించారు.గురువారం గద్వాలలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో హరిత,బాలాజీ పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ,మార్కెట్ ధరలు,మిల్లుల పనితీరు,రైతులకు లభిస్తున్న ధరలు తదితర అంశాలపై అధికారులు,మిల్లుల యజమానులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు అందిస్తున్న ధరలకు,సీసీఐ కొనుగోలు ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమీక్షించారు.రైతులు పత్తిని విక్రయించేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోనే పత్తిని విక్రయించుకునేలా మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని

తెలిపారు.కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని,తూకం,ధర నిర్ణయం,చెల్లింపుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.సీసీఐ ద్వారా పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 ధర లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించాలనుకునే రైతులు తమ మొబైల్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.స్థానికంగా పత్తి కొనుగోళ్లను ప్రోత్సహించడం వల్ల రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు జిల్లాలో వ్యవసాయ ఆధారిత వ్యాపార కార్యకలాపాలకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం మిల్లుల్లో పత్తి నుంచి విత్తనాలను వేరు చేసే జిన్నింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.వేబ్రిడ్జి విభాగంలోని కార్యకలాపాలను పర్యవేక్షించారు.జిన్నింగ్,ప్రెస్సింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి,తయారైన పత్తి బేళ్లను చూశారు.పత్తి విత్తనాలను వేరు చేయడం,వాటిని ఆయిల్ మిల్లులకు సరఫరా చేయడం,పత్తి ప్రాసెసింగ్ విధానాలు,మిల్లుల ఉత్పత్తి సామర్థ్యం తదితర అంశాలపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం,ఎల్‌నినో ప్రభావంతో సాగుపై పడిన ప్రభావం,పత్తి ఉత్పత్తిలో వచ్చిన మార్పులపై కూడా చర్చించారు.జిల్లాలో అందుబాటులో ఉన్న పత్తి ప్రాసెసింగ్ సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని,రైతులకు స్థానికంగానే మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేలా సంబంధిత అధికారులు,మిల్లుల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ,గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎల్లస్వామి,సీసీఐ ప్రతినిధి రాహుల్,మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే రెండేళ్ల వరకు జైలు శిక్ష,రూ.50 వేల వరకు జరిమానా:అసిస్టెంట్ కమిషనర్ బి.వేణుగోపాల్

- మల్దకల్‌లో 14 మంది బాల కార్మికులకు విముక్తి
- ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ

మల్దకల్ అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): మల్దకల్ మండలంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 14 మంది బాల కార్మికులను గుర్తించి,వారిని రక్షించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి.వేణుగోపాల్ తెలిపారు.పత్తి విత్తనాల పొలాల్లో పనుల కోసం మూడు వాహనాల్లో బాలలను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు.రక్షించిన బాలల్లో నెతోనిపల్లికి చెందిన ఎనిమిది మంది,ఆలూరుకు చెందిన ముగ్గురు,పెద్దొడ్డికి చెందిన ఇద్దరు,అరగిద్దకు చెందిన ఒకరు ఉన్నారు.ఈ ఘటనకు సంబంధించి అరగిద్ద ఆంజనేయులు (రాయపురం),కురువ వీరేష్ (పెద్దొడ్డి), జమ్మన్నలపై విచారణ చేపట్టి,ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి,కౌన్సెలింగ్ అనంతరం చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. బాల కార్మిక నిషేధం,నియంత్రణ చట్టం–1986 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. విచారణ ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా,విద్యను అభ్యసించేలా చూడాలని వేణుగోపాల్ కోరారు.బాలల హక్కులు,భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఎక్కడైనా బాలలను పనుల్లో పెట్టుకున్నా,పని కోసం తరలిస్తున్నట్లు గుర్తించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది,స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో యువతలో ఐక్యత.. స్నేహభావం పెంపొందుతుంది!

- దసరా, గంగమ్మ జాతర సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ
- ఎస్సై జె. నరేష్, ముంత మల్లయ్య యాదవ్‌కు ఘన సన్మానం

వీపనగండ్ల, ప్రజాజ్యోతి రిపోర్టర్:దసరా పండుగ, గంగమ్మ జాతర సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మండల కేంద్రంలోని బెక్కెం బాట రహదారిలో చర్చి సమీపంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను స్థానిక ఎస్సై జె. నరేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఉమ్మడి

మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. దీంతో క్రీడా మైదానంలో సందడి నెలకొంది.ఈ సందర్భంగా ఎస్సై జె. నరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడాస్ఫూర్తితో ఆటల పోటీలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తిని పెంచుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, పరస్పర గౌరవంతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఆటల సమయంలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా స్నేహపూర్వక వాతావరణంలో పోటీలను కొనసాగించాలని కోరారు.

టోర్నమెంట్‌కు సహకరించిన వారికి ఘన సన్మానం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్‌ను, టోర్నమెంట్‌ను ప్రారంభించిన స్థానిక ఎస్సై జె. నరేష్‌ను అంబేద్కర్ యూత్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ ద్వారా యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని క్రీడల్లో యువత రాణించేందుకు ఈ టోర్నమెంటు ఎంతగానో దోహద పడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు మీసాల నాగరాజు పాము రాజశేఖర్ మీసాల శివ దయ్యపు కృష్ణ పాము నాగులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల డిపో నూతన మేనేజర్‌కు టి డబ్ల్యు యు కమిటీ ఘన సత్కారం

గద్వాల అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల ఆర్టీసీ డిపోకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రవణ్ కుమార్‌ను తెలంగాణ వర్కర్స్ యూనియన్ గద్వాల డిపో కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో సన్మానించారు.అనంతరం కమిటీ సభ్యులు తమను పరిచయం చేసుకుని,డిపోకు సంబంధించిన అంశాలపై ఆయనతో ఆత్మీయంగా చర్చించారు.ఈ సందర్భంగా డిపోలో నెలకొన్న సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మేనేజర్ శ్రవణ్ కుమార్ యూనియన్ నాయకులను అడిగి తెలుసుకున్నారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.డిపో అభివృద్ధికి,విధుల నిర్వహణకు యూనియన్ నాయకులు కూడా సహకరించాలని కోరారు.నూతన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడం పట్ల టి డబ్ల్యు యు డిపో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో సమన్వయంతో పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

చిన్నారి మోక్షితకు కాంగ్రెస్ నేతల నివాళులు

దేవరుప్పుల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన ఆకుల కొమురయ్య కుమారుడు ఆకుల భాస్కర్ కూతురు చిన్నారి మోక్షిత అనారోగ్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాలతో మండల అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ మార్గదర్శకత్వంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు

తోటకూరి రమేష్ తదితరులు గురువారం చిన్నారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో జనగామ జిల్లా విజయ డెయిరీ అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, మండల నాయకులు రెడ్డి రాజుల రమేష్, బోనగిరి యాకయ్య, మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, సీతారాంపురం మాజీ సర్పంచ్ రెడ్డి రాజుల రమేష్, బబ్బురి బాలరాజు, జక్కుల గంగరాజు, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్, తోటకూరి వెంకన్న, గోడిశాల రాములు, ఆకుల లక్ష్మయ్య, పులిగిల్ల ఎల్లయ్య, కారుపోతుల సోమయ్య, రేగటి సోమన్న, గ్రామ యూత్ అధ్యక్షుడు ఆకుల సంతోష్, కారుపోతుల విజయ్, లోడంగి అశోక్, తోటకూరి సంతోష్, బొజ్జం సుధీర్, ఆలకుంట్ల చందు, దేవరుప్పుల సోషల్ మీడియా ప్రతినిధి రెడ్డి రాజుల ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో ప్రథమ స్థానంలో పాలకుర్తి నిలవాలి - ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

దేవరుప్పుల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గురువారం వారు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పాలకుర్తి నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.నవంబర్ 5వ తేదీ

లోపు అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు.పాత ఓటర్ల పునరుద్ధరణతో పాటు కొత్తగా డిగ్రీ పూర్తి చేసి అర్హత సాధించిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా పర్యటించి ఓటరు నమోదును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇది మంచి అవకాశమని అన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

దేవరుప్పుల మండల కాంగ్రెస్ నూతన కమిటీ ప్రకటన

దేవరుప్పుల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గురువారం ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని,కాంగ్రెస్ ఆశయాలను,ప్రభుత్వ

సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.నూతన మండల అధ్యక్షులుగా దావెరా అనిల్ కుమార్,ఉపాధ్యక్షులుగా చిలుకూరి చంద్రమౌళి, గుగులోతు రాజేందర్,ప్రధాన కార్యదర్శులుగా రుద్రోజు పురుషోత్తం చారి,మొటికె చంద్రశేఖర్, పెద్ది సోమయ్య, మేడ విద్యాసాగర్,కార్యదర్శులుగా పులింపుల సురేష్ గౌడ్,కృష్ణ పురుషోత్తం,నునావత్ నర్సింహ, ధారావత్ హంబ్లి, మాసంపల్లి మహేందర్, బట్ట యాదగిరి,కార్యవర్గ సభ్యులుగా అల్లం సుజాత రెడ్డి, శివ రెడ్డి, బషపాక లక్ష్మి , భూక్య యాద, చికటి యాకయ్య, గదారి రమేష్, కనబోయిన శోభన్ బాబు, బోడ యాకన్నలను నియమించారు.అనుబంధ విభాగాలు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఇనుముల నాగరాజు, బీసీ సెల్ అధ్యక్షులుగా కడబోయిన గణేష్, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా ఎండీ జాకీర్, కిసాన్ సెల్ అధ్యక్షులుగా గోపు సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సావిత్రిలను నియమించారు. తనపై నమ్మకంతో మండల కమిటీలో బాధ్యతలు అప్పగించిన నూతన మండల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తామని అన్నారు.

మండల ప్రధాన కార్యదర్శిగా రుద్రోజు పురుషోత్తం చారి

అభినందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

దేవరుప్పుల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రుద్రోజు పురుషోత్తం చారిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గురువారం నియమించారు.ఈ సందర్భంగా రుద్రోజు పురుషోత్తం చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేస్తానని పేర్కొన్నారు.

నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి!

నీరు, విద్యుత్, ఆహార వృథాను అరికడదాం.. భావితరాల భవిష్యత్తును కాపాడుకుందాం!

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.. - పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్

పర్వతగిరి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి) ప్రత్యేక కథనం: నీరు లేనిదే జీవం లేదు.. నీటిని కాపాడుకోక పోతే భవిష్యత్తుకు భరోసా లేదు. ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వనరుల్లో నీరు అత్యంత విలువైనది. పెరుగుతున్న జనాభా, మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు, భూగర్భ జలాలపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. నీటి కొరత ఏర్పడినప్పుడు ఆందోళన చెందడం కంటే.. నీరు వృథా కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమ మార్గం. ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో నీటి పొదుపు అలవాటుగా మారితేనే భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించగలం.

ఇంట్లోనే మొదలుకావాలి.. నీటి పొదుపు:

నీటి సంరక్షణ కోసం పెద్దపెద్ద కార్యక్రమాలే అవసరం లేదు. మన దైనందిన జీవితంలో చిన్నచిన్న మార్పులు చేసుకున్నా ఎంతో నీటిని ఆదా చేయవచ్చు. పళ్లు తోమేటప్పుడు, గడ్డం చేసుకునేటప్పుడు కుళాయిలను తెరిచి ఉంచకుండా మూసివేయాలి. షవర్‌కు బదులుగా బకెట్‌తో స్నానం చేయడం, వాహనాలను పైపులతో కడగకుండా బకెట్‌లోని నీటిని వినియోగించడం, నీటి పైపులు, కుళాయిల్లో లీకేజీలను వెంటనే మరమ్మతు చేయించడం వంటి చర్యలు నీటి వృథాను తగ్గిస్తాయి. ఇళ్లలో నీటి వినియోగంపై కుటుంబ సభ్యులు అవగాహన పెంచుకోవాలి. అవసరానికి మించి నీటిని నిల్వ చేయడం, వినియోగించకుండా పారబోయడం వంటి అలవాట్లను విడనాడాలి. నీటి పొదుపు చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దవచ్చు.

వర్షపు నీటిని ఒడిసిపడితేనే భూగర్భ జలాలకు భరోసా:

వర్షపు నీరు వృథాగా ప్రవహించి పోకుండా సాధ్యమైన చోట నిల్వ చేసుకోవడం, భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. ఇళ్ల ఆవరణల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించాలి. గ్రామాల్లో చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను పరిరక్షించుకోవాలి. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు తోడ్పడవచ్చు.

వృథా నీటికి మళ్లీ వినియోగం.. ప్రకృతికి మేలు:

కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు పోయడం, ఆర్ఓ ప్యూరిఫైయర్ నుంచి వెలువడే నీటిని తగిన అవసరాలకు వినియోగించడం వంటి పద్ధతులను పాటించాలి. వాషింగ్ మెషీన్లను సాధ్యమైనంత వరకు పూర్తి లోడ్‌తో నడపాలి. ఫ్లష్ ట్యాంకుల్లో నీటి వినియోగాన్ని తగ్గించే పద్ధతులను అవలంబించాలి. అయితే పునర్వినియోగించే నీటిని దాని నాణ్యతకు తగిన పనులకే ఉపయోగించాలి. తాగునీటి పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదు.

నీటితోపాటు విద్యుత్, ఆహారాన్ని ఆదా చేయాలి:

ప్రకృతి వనరుల సంరక్షణ అనేది నీటితోనే ముగిసిపోదు. అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఇతర పరికరాలను ఆపివేయాలి. కుటుంబ అవసరాలకు సరిపడా ఆహారాన్ని మాత్రమే వండుకోవాలి. మిగిలిన ఆహారాన్ని సురక్షితంగా నిల్వ చేసి వినియోగించుకోవాలి. ఆహారం, విద్యుత్, నీటి వృథాను అరికట్టడం ద్వారా కుటుంబ ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడవచ్చు.

ప్రజల్లో అవగాహన పెంచాలి.. గ్రామాలను నీటి భద్రత దిశగా నడిపించాలి:

నీటి సంరక్షణపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళా సంఘాలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. నీటి వనరులను కాపాడుకోవడం ఒక్క ప్రభుత్వానిదో, అధికారులదో బాధ్యత కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత. నేటి తరం నీటిని పొదుపుగా వినియోగిస్తేనే రేపటి తరాలకు తగినంత నీరు అందించే అవకాశం ఉంటుంది.

ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ పిలుపు:

ఈ సందర్భంగా పర్వతగిరి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మాలోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. నీరు, విద్యుత్, ఆహారం వంటి ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నీటి కొరత ఏర్పడిన తర్వాత

ఇబ్బందులు పడకుండా ముందుగానే అప్రమత్తమై నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి ఇంట్లో నీటి పొదుపు అలవాట్లను పాటించాలని, కుళాయిల లీకేజీలను అరికట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని కోరారు. నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించడం, సాధ్యమైన చోట వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవడం, నీటి వనరులను పరిరక్షించడం వంటి చర్యలపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్, ఆహార వృథాను కూడా అరికట్టి ప్రకృతి వనరుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చవచ్చని పేర్కొన్నారు.

వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

గ్రీనరీ, లైటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి): జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో చేపట్టిన వడ్డేపల్లి చెరువు బండ్ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.

గురువారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నతో కలిసి బండ్‌పై జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్, గ్రిల్స్, టైల్స్, వాష్‌రూమ్‌లు, విద్యుత్ దీపాలు, పెయింటింగ్, జిమ్, ప్రహరీ గోడ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. బండ్ దిగువన ఏర్పాటు చేస్తున్న ఫుడ్ జోన్ల వద్ద సీటింగ్ సదుపాయాలు, గోడలపై రంగుల చిత్రాలు, పచ్చదనం పెంపు, పిల్లల ఆటస్థలం వద్ద అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఫుడ్ కోర్టులకు ఆకర్షణీయమైన రంగులు వేయించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. బండ్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా గ్రీనరీని అభివృద్ధి చేయాలని, విద్యుత్ దీపాల ఏర్పాటు సహా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు రాని ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి - బీజేపీ

దేవరుప్పుల, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): దేవాదుల నీళ్ల కోసం ధర్నా చేసిన బీజేపీ నేత లేగ రామ్మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు పిలిస్తే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రాకుండా పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం బిజెపి రాష్ట్ర

నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ఆరోపణలపై తాము గతంలో చెప్పిన విధంగా ఉదయం 11 గంటలకు పాలకుర్తి శివాలయం వద్దకు ఆధారాలతో ఎమ్మెల్యేను తీసుకురావాలని సవాల్ విసిరామన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసినా, ఉదయం 11 గంటలకు తాము శివాలయానికి చేరుకున్నామన్నారు. ఎమ్మెల్యే చర్చకు రాకుండా పోలీసులతో అరెస్టు చేయించి పాలకుర్తి, అనంతరం దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కు తరలించారని తెలిపారు. ఆధారాలు లేని ఆరోపణలకు కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, రైతులకు దేవాదుల నీళ్లు ఇచ్చే వరకు ఎమ్మెల్యేను వదిలేది లేదని హెచ్చరించారు.కార్యక్రమంలో జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింత సృజన్ కుమార్, జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, మండల అధ్యక్షులు బస్వ భాస్కర్, కాసాని సత్తయ్య, భాషిపాక సుధాకర్, బస్వ మహేష్, ఉప్పునూతల నాగరాజు గౌడ్, భాషిపాక కొండయ్య, రామగిరి గణేష్, మూడ అన్వేష్, దొంగరి మహేందర్, మారం రవికుమార్, వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అనుమతులకు కొత్త పోర్టల్

ఐదు రోజుల్లో లేదా వారంలోపు అనుమతులు.. త్వరలో సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానం అమలు

హనుమకొండ, అక్టోబరు 29, (ప్రజా జ్యోతి): గ్రావెల్ (మట్టి) తవ్వకాలు, తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కొత్త పోర్టల్ అమలు, దరఖాస్తుల పరిశీలన, అనుమతుల మంజూరు తదితర అంశాలపై చర్చించారు.

రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాలకు గ్రావెల్ తరలించే క్రమంలో అనుమతుల ప్రక్రియను సరళీకరించడమే కొత్త విధానం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. తక్కువ పరిమాణంలో గ్రావెల్ అవసరమైన వారు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని త్వరగా అనుమతులు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, ఐదు రోజుల నుంచి వారం రోజుల్లోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.



ఈ పోర్టల్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అభివృద్ధి చేయనుంది. కొత్త విధానంపై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని కలెక్టర్ తెలిపారు. రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు గ్రావెల్ తరలించే వాహనాల వివరాలను నమోదు చేయడంతోపాటు, వాహనాలు గ్రామంలోకి ప్రవేశించిన, బయటకు వెళ్లిన సమయాలను పోర్టల్‌లో పొందుపరుస్తారని వివరించారు. కొత్త విధానం అమలుతో అనధికార గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అడ్డుకట్ట వేయడంతోపాటు, గ్రామాల్లో చిన్నచిన్న పనులకు అవసరమైన గ్రావెల్‌ను సులభంగా పొందే అవకాశం కలగనుంది.సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, ఈడీఎం శ్రీధర్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

సన్నగిల్లుతున్న రైతన్నల ఆశలు.. చేతికొచ్చిన పంటలు ఎండలకు నేలపాలు

ఎన్నో ఆశలతో సాగుచేసిన ఖరీఫ్ పంట కన్నీరే మిగిల్చింది. మొదట్లో వర్షం వచ్చే సూచన ఉండడంతో బోర్లు పోయడంతో మండలంలో రైతులు వరిసాగు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు పేరిగి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. చుట్టుపక్కల కాలువల ద్వారా చెరువులు నింపి నీళ్లు వస్తున్నాయని రైతులు అనుకొని వరి సాగు చేశారు. కానీ చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చే లోపే మండే ఎండలకు నేలకొరుగు తున్నాయి.పంట చేతికొస్తుందని ఆశించిన అన్నదాతకు అడుగంటిన బోర్లతో నిరాశ మిగిల్చింది. పంటలు కాపాడుకోవడానికి రైతన్న ఆరాటం అంతా ఇంత కాదు. చివరి ప్రయత్నంగా బోర్లు వేసి పంటను కాపాడుకోవాలని చేస్తూన్న ప్రయత్నం విఫలం అవడంతో అప్పుల పాలవుతున్నారు.అధికారులు చెరువులు నింపి భూగర్భ జలాలు పెరిగే చర్యలు తీసుకున్నట్లయితే పంటలు చేతికి వచ్చేవి. కండ్ల ముందే చేతికి వచ్చిన పంట ఎండిపోవడంతో పశువులకు గొర్లకు మేతగా మారింది.

ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన వరి పంట రైతు మామిడాల అంజయ్య 8 ఎకరాలు వరి సాగు

చేశారు. ముందు చెరువులు కుంటలు నింపుతున్నామని ప్రజాప్రతితులు చెప్పినప్పటికీ వరి పంట సాగు అవుతుందని 8 ఎకరాలు వరి సాగు చేశారు కానీ చెరువులు కుంటలు నింపకపోవడంతో బోర్లు

ఎత్తివేసాయి. పంట చేజారిపోవడంతో పంటను పశువులకు మేతగా వేశారు. పంట పొలాల్లో పచ్చదనం కనుమరుగైపోయి ఎండిన చేన్లు దర్శనమిస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పంటను కోయడం కంటే పశువులను మేపడమే మంచిదని భావిస్తూ పొలాల్లోనే పశువులను కట్టేస్తున్నారు. సాగు కోసం విత్తనాలు ఎరువులు పురుగుల మందులు కూలీలకు భారీగా ఖర్చు చేసిన రైతులకు చివరకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది . పంట చేతికొచ్చే సమయంలో పరిస్థితులు అనుకూలించకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని ప్రస్తుతం పంట పరిస్థితి చూస్తుంటే పెట్టుబడి వస్తుందో రాదు అన్న అనుమానం నెలకొంది. పంట నష్టం పై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచన వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతుల కోరుతున్నారు.

అప్పుల ఊబిలో అన్నదాత:

చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాత తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో గ్రామలలో పలు రైతులు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ పంటను కాపాడేందుకు ప్రయత్నం చేసినారు. అప్పుడు చాలా ఖర్చుతో కూడుకొని పొట్ట కొచ్చిన పంటను కాపాడుకొని లాభాలు రాకుండా పెట్టుబడి వెళ్లడానికి నాన తంటాలు పద్దారు. శ్రీనివాసపురం పటేల్ గూడెం కొలనుపాక గుండ్లగూడెం రాఘవాపురం గ్రామాలలో భూగర్భ జలాలు మొత్తం ఎండిపోయి పంట పొలాల్లో నెర్రెలు పారే విధంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పుడు అయితే విద్యుత్ కొరత అధికంగా ఉండడంతో ట్రాక్టర్ల ద్వారా నీటి నీ సరఫరా చేయడం సరిపోదు. అలాంటి ప్రయత్నాలు చేసి విఫ్లమయ్యారు. ప్రతిరోజు 8 గంటల నుండి 10 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుండదంతో నీటి కొరత ఏర్పడింది. వేల రూపాయలు చెల్లించి బోర్లు వేసిన లాభం లేకుండా పోయింది. రైతులు ఇలాంటి ప్రయత్నాలు చేసిన పంటలు కాపాడుకోలేక ఆందోళన చెందుతున్నారు. అధికారులు పాలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఏడున్నర ఎకరాల పంట పొలం ఎండిపోయింది
మామిడాల అంజయ్య రైతు కొలనుపాక

ఏప్పటి లాగానే వరి పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. అయితే గతంలో లాగా 8 ఎకరాల వరి పంట సాగు చేశా ఏడున్నర ఎకరాలు వరి పంట ఎండిపోయింది. ఎకరానికి 30 వేల రూపాయలు పెట్టుబడి అయ్యింది మొత్తం 2లక్షల నలభై వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన. లో వోల్టేజ్ కరెంట్ వల్ల బోర్లు ఎండిపోతున్నాయి అందుకు బోర్లు వేద్దామని ఆలోచన వచ్చి మూడు బోర్లు వేశాను మూడు బోర్లకు కలిపి మొత్తం 2,50,000 రూపాయలు ఖర్చు అయింది. కానీ భూగర్భ జల లు అడుగంటి పోవడంతో చుక్క నీరు కూడా బయటికి రాలేదు. వ్యవసాయం పంట సాగు చేసినందుకు ఐదు లక్షల రూపాయలు నష్టపోయాను ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాను.

లో వోల్టేజ్ కారణంగా పంట ఎండిపోయింది
గడ్డం యశ్వంత్ రెడ్డి గుండ్ల గూడెం రైతు

విద్యుత్ ఎనిమిది గంటలు ఇవ్వడంతో పాటు ఓల్టేజి సమస్య చెప్పగా ఉండడంతో గతంలో లాగా మూడు ఎకరాల భూమి సాగు చేశాను కరెంటు లో వోల్టేజ్ కారణంగా ఎకరం పొలం ఎండిపోయింది. ఎకరానికి 30000 ఖర్చు అయింది. ఎండిపోయిన పంటను పశువులకు మేతగా వేశాను. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

మూడు ఎకరాలు సాగుచేస రెండు ఎకరాలు ఎండిపోయింది
బండ్రు ఆంజనేయులు పటేల్ గూడెం రైతు

భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మా గ్రామానికి నీరు లేకపోవడంతో రెండు ఎకరాల వరి

పంట ఎండిపోయింది. మొత్తం ఏడెకరాల భూమి ఉంది మూడు ఎకరాలు వరి పంట సాగు చేశాను. రెండెకరాలు ఎండిపోయింది. ఎకరానికి 35000 ఖర్చు అయింది మొత్తం 70 వేల ఖర్చు వచ్చింది.

ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 80 మంది

నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి)
నకిరేకల్ నియోజకవర్గం లోని కట్టంగూర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు దాసరి లింగయ్య, దాసరి కళమ్మతో పాటు మొత్తం 80 మంది

కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూర్ మండల కేంద్రంలో సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో వరంగల్–ఖమ్మం–

నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించి నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేద మహిళ వైద్య చికిత్సకు రూ.6 లక్షల ఎల్ఓసీ మంజూరు

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధికి చెందిన ఎమ్మె అంజమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య చికిత్సకు రూ.6 లక్షల ఖర్చు అవుతుందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ఎల్ఓసీని ఆలేరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీకాంత్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ భరోసా

జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్

గరిడేపల్లి,అక్టోబర్ 29(ప్రజా జ్యోతి):
ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి,వారి ఆత్మగౌరవా న్ని నిలబెట్టడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,రాయినిగూడెం గ్రామ సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ అ న్నారు. గురువార ం గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పేద,మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని రామాంజిగౌడ్ పేర్కొన్నారు.ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాల న్నదే ప్రభుత్వ లక్ష్యమని,ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యద ర్శి సునీత,మాజీ ఎంపీటీసీ బాలుదూరి సందీప్,గ్రామ శాఖ అధ్యక్షుడు శంభయ్య రాష్ట్ర డీలర్ల కార్యదర్శి గుండు గురవ య్య,యువజన నాయకులు గుండు నరేష్,నరసింహ,లబ్ధిదా రులు,గ్రామ పెద్దలు,అధికారులు పాల్గొన్నారు

రైతులు దళారులను నమ్మొద్దు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

క్వింటాల్‌కు రూ.2,460 ధర.. మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):
రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.

మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు:

రైతులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,460 ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దళారుల మాటలు నమ్మి నష్టపోవద్దని హెచ్చరించారు. ధాన్యం

రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కొలనుపాక గ్రామంలో గతంలో ఈ కేంద్రం ద్వారా 50 వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. ఈసారి కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించడంలో సహకరించిన తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రైతుల అవసరాలకు అనుగుణంగా పీఏసీఎస్, ఎఫ్‌పీవో, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా, అవసరమైన ప్రాంతాల్లో అదనపు కొనుగోలు ఏర్పాట్లు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావం, సముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా రాబోయే పంటలపై ప్రభావం పడే అవకాశమున్నందున, వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ యాకమ్మ వెంకటేష్, ఉపసర్పంచ్ విజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతే మైసయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, పీఏసీఎస్ డైరెక్టర్లు చాడ రాజు, బండ వీరమల్లయ్య, వట్టిపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింలు, సీఈవో వెంకటరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండని శిశువులకు యశోద ఆసుపత్రిలో అధునాతన వైద్య సేవలు

దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :
నెలలు నిండకముందే జన్మించిన, తక్కువ బరువుతో పుట్టిన, తీవ్ర

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నవజాత శిశువులకు మెరుగైన వైద్య సంరక్షణ అందించేందుకు హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆసుపత్రిలో లెవల్–III నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. పుట్టిన తొలి రోజులు నవజాత శిశువులకు అత్యంత కీలకమని, ఈ సమయంలో ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అవసరమని కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, నియోనేటాలజిస్ట్ డాక్టర్ బి. ప్రశాంత్ బాబు తెలిపారు. శ్వాస సంబంధిత సమస్యలు, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, కామెర్లు, ఆక్సిజన్ లోపం వంటి సమస్యలకు ఆధునిక వైద్య చికిత్సతో పాటు ప్రత్యేక పోషకాహార సంరక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిశువులు పాలు తాగకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీర ఉష్ణోగ్రతలో మార్పులు, మూర్ఛలు, అధిక నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. శిశువుల ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించడంతో పాటు, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు: ఎ. వాసుకిరణ్ రెడ్డిని 97057 71230, 99499 98378 నంబర్లలో సంప్రదించవచ్చు.

కరువు బూఛీ... అమాంతం పెరిగిన బియ్యం ధరలు...!

అల్లాడుతున్న సామాన్యులు

బియ్యం ధరలను ప్రభుత్వం నియంత్రించాలి

మట్టిమనిషి వేనేపల్లి

మిర్యాలగూడ, అక్టోబర్ 29,(ప్రజాజ్యోతి):
ఎల్ నినో... కరువు బూఛీ సాకుగా చూపి... ధాన్యం నిల్వలు దాచి.. బియ్యం ధరలను అమాంతం పెంచడం తో.. భవిష్యత్తు తలుచుకుని సామాన్యుడు ఆందోళన చెందుతున్న పరిస్థితి దాపురించిందని, పెంచిన బియం ధరలను

ప్రభుత్వం నియంత్రించాలని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు కోరారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ గత వానకాలం,యాసంగి, రైతుల వద్ద క్వింటాలుకు 2,300 రూపాయలకు కొన్న వడ్ల ను బియ్యంగా మార్చి, ప్రస్తుతం క్వింటా 10 వేల వరకు బహిరంగ మార్కెట్ లో అమ్ముతున్నారని,ఇది అన్యాయమైన విషయమన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని పాత బియ్యంకు ధరలు పెంచకుండా చూడాలన్నారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో కొంటున్న వడ్లకు ధరలు తగ్గించి, బియ్యానికి మాత్రం భారీగా రేటు పెంచారన్నారు. అంత భారీ వ్యత్యాసం ఉండకుండా చూడాలని కోరారు.మాములు గా వడ్లు క్వింటా కు 2,300 కొని బియ్యం క్వింటా 4000కు అమ్మితేనే రైస్ మిల్లర్లకు విపరీతంగా లాభాలు వచ్చాయని ఇప్పుడు సిండికేట్ గా మారి బియ్యం ధరలు అమాంతంగా పెంచితే మూడు రెట్లు లాభాలు పొందేందుకు వ్యాపారులు రైస్ మిల్లర్లు ప్రయత్నిస్తున్నారన్నారు. ఒకవైపు పంట సక్రమంగా లేదని చెబుతూనే మరోవైపు వందల కోట్లతో పెద్ద పెద్ద రైస్ మిల్లులు కడుతతున్నారన్నారు. ఒకవైపు కరువు ఇంకోవైపు తుపాన్ రైతులను ప్రజలను పీడిస్తుంటే మిల్లర్లు మానవీయంగా వ్యవరించాల్సింది పోయి అవకాశన్ని, అడ్డం పెట్టుకుని, అడ్డదారిలో లాభాల కోసం ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఒకవైపు కరువు తో పంటలు పండక రైతులు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బియ్యం ధరలు పెంచి ప్రజలను దోచుకోకుండా చుడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ధాన్యం విదేశాలకు ఎగుమతి కాకుండా చూడాలన్నారు. వినియోగదారులకు భారం కాకుండా రైతులు,మిల్లర్లు నష్ట పోకుండా ఒక విధి విధానం ను రూపొందించేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు.

తోటి మిత్రునికి ఆర్థిక సహాయం

నార్కట్ పల్లి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి): ఆపదలో ఉన్న వారికి మేము సైతం మేమున్నామంటూ లారీ డ్రైవర్ స్నేహితునికి ఆర్థిక సహాయం చేసిన సంఘటన కొండపాకని గూడెం గ్రామంలోశ్రీj మల్లికార్జున లారీ యూనియన్ సభ్యులు గుండెబోయిన ఐలయ్య ఇటీవల కిడ్నీ సర్జరీ కావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు లారీ యూనియన్ తరపున లారీ డ్రైవర్లు 22వేల రూపాయలఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎండి కరిముల్లా, ఉపాధ్యక్షుడు జేరిపోతుల వరప్రసాద్ గౌడ్, గుండె బోయిన శివశంకర్, మల్లేష్ యాదవ్, నరసింహ, యాదగిరి, స్వామి, శంకర్, సత్యనారాయణ, నగేష్, ఐలయ్య, అమరేందర్ రెడ్డి, సైదులు, మల్లేష్, రామలింగయ్య, శంకర్, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్ రెడ్డి, నర్సిరెడ్డి, సుభాన్, రామలింగం, నరేష్ పాల్గొన్నారు.

కేత్ బచావో అభియాన్‌లో భాగంగా

ఆరుతడి పంటలపై రైతులు ఆసక్తి కనపర్చాలి

ఇందల్వాయి అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి, వెంగళ్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం ఆయా గ్రామాలలో రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగును పూర్తిగా నివారించి, జొన్న, మినుము, పెసర, శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రామకాంత్, మనోజ్, సిర్నాపల్లి సర్పంచ్ పొగుల అనిత సాయికృష్ణ, ఉపసర్పంచ్ సుదర్శన్, వెంగళ్‌పాడ్ సర్పంచ్ మీన గంగాధర్, ఉపసర్పంచ్ మహిపాల్ నాయక్, నల్లవెల్లి సింగిల్ విండో చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, గంగారెడ్డి, ఎల్ఐసి గంగాధర్, సరస్వతి, మాజీ సర్పంచ్ రాయసింగ్ మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రశస్త్ యాప్‌పై

ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం

కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 29: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం కమ్మర్‌పల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల గుర్తింపు, నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి, వారి వివరాలను ప్రశస్త్ యాప్‌లో నమోదు చేసే విధానంపై

ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వనరుల వ్యక్తులుగా కమ్మర్‌పల్లి ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు ఆది నాగలక్ష్మి, ప్రత్యేక విద్యావేత్త బి. మధుశేఖర్, భవిత కేంద్రం ఐఈఆర్‌పీ డి. రాజన్న పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

బాల్కొండలో విద్యార్థులకు ద్విభాషా నిఘంటువుల పంపిణీ

- విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు పీఎం శ్రీ పథకం ద్వారా కృషి

బాల్కొండ,(ప్రజా జ్యోతి) అక్టోబర్ 29: బాల్కొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు పీఎం శ్రీ పథకం కింద ద్విభాషా నిఘంటువులను పంపిణీ చేశారు. మండల అభివృద్ధి అధికారి విజయ భాస్కర్ రెడ్డి విద్యార్థులకు ఈ నిఘంటువులను అందజేశారు.విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడం,నూతన పదాలను నేర్చుకునేలా ప్రోత్సహించడం, పదజాలాన్ని విస్తృతం చేయడం,స్వయంగా చదివి అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల విద్యార్థుల కోసం ఒక్కొక్కటి సుమారు రూ.270 విలువ కలిగిన 333 శంకర్ నారాయణ ద్విభాషా నిఘంటువులను పీఎం శ్రీ పథకం ద్వారా అందజేశారు.ఈ నిఘంటువులు విద్యార్థులకు ఆంగ్ల పదాల అర్థాలను తెలుసుకోవడంలో,ఆంగ్ల భాషపై పట్టు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి

అధికారి విజయ భాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్, మండల అభివృద్ధి కార్యాలయ సూపరింటెండెంట్ రమణ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం. ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నరు.

తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

- కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి
- వాహనాల వేగ నియంత్రణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

ఇందల్వాయి(ప్రజా జ్యోతి) అక్టోబర్ 29: ఇందల్వాయి మండల కేంద్రంలోని చంద్రాయన్ పల్లి నీ అకస్మాత్తుగా తనిఖీ చేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జాతీయ రహదారి నంబర్ 44 పై ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి సమీపంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్.,లి గారు గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. అదే ప్రాంతంలో కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను తనిఖీ చేసి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రమాదాలు తరచుగా జరుగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన పోలీస్ కమిషనర్ గారు, నేషనల్ హైవే మేనేజర్ (టెక్) రంగారావు , హైవే కాంట్రాక్టర్ బాల్ రెడ్డితో మాట్లాడి కల్వర్టు నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే, జాతీయ రహదారిపై

వాహనదారులు వేగాన్ని నియంత్రించుకునేలా తగిన ప్రదేశాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లోనూ వాహనదారులకు ప్రమాదకర ప్రాంతాలు ముందుగానే కనిపించేలా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. టోల్ ప్లాజా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖతో పాటు జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ, కాంట్రాక్టర్లు , టోల్ ప్లాజా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ గారు సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, నేషనల్ హైవే మేనేజర్ రంగారావు, హైవే కాంట్రాక్టర్ శ్రీ బాల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మలేష్, డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్కె. వినోద్, ఇందల్వాయి ఎస్ఐ శ్రీమతి సుమలత, చంద్రయన్ పల్లి సర్పంచ్ రఘు, టోల్ ప్లాజా సిబ్బంది, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ మనందరి బాధ్యత

- ఎఫ్ఆర్ఓ రవి మోహన్ బట్

ఇందల్వాయి(ప్రజా జ్యోతి) అక్టోబర్ 29: ఇందల్వాయి మండల కేంద్రంలోని.ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎఫ్ఆర్ఓ రవి మోహన్ బట్ సూచించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం, నీటిని పొదుపుగా వినియోగించడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొత్త బోర్‌వెల్లు వేయాలంటే సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమతి లేకుండా బోర్లు వేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వ్యవసాయంలో బిందు సేద్య పద్ధతిని వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చని సూచించారు.

చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని అన్నారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల మట్టం పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు.

భవిష్యత్తులో నీటి కొరతను నివారించాలంటే ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ, నీటి వనరులను సంరక్షించాలని ఎఫ్ఆర్ఓ రవి మోహన్ బట్ కోరారు.

చట్టం పై విద్యార్థులకు న్యాయ సేవ అవగాహన సదస్సు

- సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవిత దేవి

జహీరాబాద్, అక్టోబర్ 29(ప్రజా జ్యోతి న్యూస్) సురక్ష బచపన్ అభియాన్ లో భాగంగా బాలలకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి కృష్ణవేణి ఉన్నత పాఠశాల అల్లీపూర్ లో, షాహీన్ పాఠశాలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ఖలీల్, భవన్స్ పాఠశాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి బ్లెస్సి నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన చట్టాలపై

వివరించారు. న్యాయ మూర్తులు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో ఉండాలని ,చదువుపై శ్రద్ధ వహించి చక్కగా చదువుకో వాలని, పెద్దలను తోటి వారిని గౌరవించాలని, చదువుతోపాటు సాధారణ చట్టాల పై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించిన వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియజేశారు. విద్యార్థినీ లకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ఒక లక్షాన్ని నిర్దేశించుకుని, ఆలక్ష సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు సెక్సువల్ ఆఫెన్సెస్ పైన తప్పకుండ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థినిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహ నిరోధక చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, ప్రొటెక్షన్ అఫ్ సెక్సువల్ ఆఫెన్సెస్ పై విస్తృతంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయలు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉద్యోగ అవకాశాల

స్క్రీనింగ్ క్యాంప్‌కు 36 దరఖాస్తులు

నర్సాపూర్ 29 అక్టోబర్ (ప్రజాజ్యోతి) మహిళా,శిశు సంక్షేమ శాఖ,మెదక్ జిల్లా బి డబ్ల్యు ఓ హేమ భార్గవి ఆధ్వర్యంలో యూత్4జాబ్స్ ఫౌండేషన్ (యూత్ 4జాబ్స్ ఫౌండేషన్)సమన్వయంతో దివ్యాంగులకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈరోజు నర్సాపూర్ రైతు వేదికలో గురువారం నాడు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి కలిగిన దివ్యాంగ అభ్యర్థుల నుంచి మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. అభ్యర్థుల విద్యార్హతలు,నైపుణ్యాలు, అర్హతలను పరిశీలించి,వారికి తగిన నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సంబంధిత సంస్థలు మార్గదర్శకత్వం అందించనున్నాయి.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సూపర్వైజర్లు వసుమతి సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

- సర్వే నంబర్ 189లో ఫామ్‌హౌస్..
- ఎకరం భూమిలో భారీ భవనాల పిల్లర్లు!
- నాలా కన్వర్షన్, పంచాయతీ అనుమతులపై నిగ్గు తేల్చేదెప్పుడు?
- గతంలో నోటీసులకే పరిమితమైన చర్యలు..
- ఇప్పుడు కార్యదర్శి హెచ్చరికలతో సరిపెడతారా?

మనసానిపల్లిలో నిర్మాణాల దందా!

కొండాపూర్ ప్రజా జ్యోతి: కొండాపూర్ మండల పరిధిలోని మనసానిపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 189లో నిర్మాణాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గతంలో నిర్మించిన ఫామ్‌హౌస్‌కు అనుమతులు ఉన్నాయా? ప్రస్తుతం సుమారు ఎకరం భూమిలో చేపడుతున్న భారీ భవనాల నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు పొందారా? వ్యవసాయ భూమి వినియోగ మార్పిడికి అవసరమైన నాలా కన్వర్షన్ ప్రక్రియ పూర్తయిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

నోటీసులకే పరిమితమైన గత చర్యలు!

సర్వే నంబర్ 189లో గతంలో నిర్మించిన ఫామ్‌హౌస్ విషయంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే నోటీసుల తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? పంచాయతీ రికార్డుల్లో ఆ భవనం వివరాలు ఎందుకు లేవు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. నోటీసులు జారీ చేయడమే కాకుండా, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ వ్యవహారంలో గతంలో తీసుకున్న చర్యలపై ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం కనిపిస్తోంది.

నాలా కన్వర్షన్ లేకుండానే ఆర్థిక కార్యకలాపాలా?

వ్యవసాయ భూమిలో నిర్మాణాలు, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన భూమి వినియోగ మార్పిడి అనుమతులు పొందారా? సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? అనే అంశాలు పరిశీలనకు రావాల్సి ఉంది. భూమి స్వరూపం, వినియోగం, నిర్మాణాల అనుమతులకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలి. అనుమతులు లేకుండా కార్యకలాపాలు సాగుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ఎకరం భూమిలో భారీ భవనాలు.. అనుమతులు ఎక్కడ?

సర్వే నంబర్ 189 పరిధిలో సుమారు ఎకరం భూమిలో కొత్తగా భారీ భవనాల నిర్మాణానికి పిల్లర్లు వేస్తున్నట్లు సమాచారం. ఈ నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నాయా? లేక అనుమతులు పొందకుండానే పనులు చేపడుతున్నారా? అన్నది అధికారులు వెంటనే నిర్ధారించాలి. నిర్మాణ అనుమతులు లేకుండా పనులు కొనసాగుతున్నట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి. నిర్మాణ పనులపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి.

పంచాయతీ కార్యదర్శి వివరణ..

ఈ వ్యవహారంపై పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ, గతంలో నిర్మించిన ఫామ్‌హౌస్ పంచాయతీ రికార్డుల్లో లేదని, ఆ నిర్మాణం తన దృష్టికి రాలేదని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మించిన ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుతం పంచాయతీ అనుమతులు లేకుండా పిల్లర్ల నిర్మాణం చేపడుతున్న వారికి పనులు వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆదేశాలను పాటించకుండా పనులు కొనసాగిస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

హెచ్చరికలతో సరిపెట్టకుండా చర్యలు తీసుకోవాలి!

మనసానిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 189లో గత ఫామ్‌హౌస్ నిర్మాణం నుంచి ప్రస్తుతం కొనసాగుతున్న భారీ భవనాల పనుల వరకు సమగ్ర విచారణ చేపట్టాలి. భూమి వినియోగ మార్పిడి అనుమతులు, పంచాయతీ రికార్డులు, నిర్మాణ అనుమతులు, గతంలో జారీ చేసిన నోటీసులు, వాటిపై తీసుకున్న చర్యలను పరిశీలించాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి క్షేత్రస్థాయి విచారణకు ఆదేశిస్తారా? లేక పనులు నిలిపివేయాలనే హెచ్చరికలకే పరిమితం అవుతారా? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణాలపై వాస్తవాలను బయటపెట్టి, నిబంధనల అమలులో పారదర్శకత చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

సైదాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- తొమ్మిది భద్రతా ఫీచర్లతో స్మార్ట్ కార్డులు
- మోసాలకు తావులేదు: సర్పంచ్ రాధిక రామ గౌడ్
- పేదలకు సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం: కాంగ్రెస్ నేత ఫర్వేజ్

కొండాపూర్ ప్రజా జ్యోతి: పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, రేషన్ బియ్యం సక్రమంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని సైదాపూర్ గ్రామ సర్పంచ్ రాధిక రామ గౌడ్ అన్నారు. గురువారం కొండాపూర్ మండల పరిధిలోని సైదాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక రామ గౌడ్ మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల్లో తొమ్మిది భద్రతా ఫీచర్లు ఉండటంతో మోసాలకు అవకాశం తగ్గుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించడంలో ఈ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

పేదలు పస్తులు ఉండకూడదన్నదే లక్ష్యం

సైదాపూర్ కాంగ్రెస్ నాయకుడు ఫర్వేజ్ మాట్లాడుతూ.. పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందన్నారు. పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందించి, ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, జీపీఓ, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, రేషన్ డీలర్ శంకర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబానికి ఆర్థికసహాయం

నంగునూర్ అక్టోబర్ 29(ప్రజా జ్యోతి):- మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దూదేకుల అలీమ (70)సం" కొంతకాలం నుండి అనారోగ్యానికి గురైంది. గత మూడు రోజుల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పద్మ బుచ్చి వీరయ్యలు మృతి విషయం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డికి తెలుపగా వెంటనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన హరీష్ రావు తన వ్యక్తిగత సహాయకుడికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆదేశించారు. అట్టి డబ్బులను అలీమా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారస నాయకులు బుచ్చి వీరయ్య వెంకట కృష్ణారెడ్డి పెద్ద కిష్టయ్య, చిన్న కిష్టయ్య బందారం సతీష్, వెంకటేష్, పిల్లి అశోక్, లక్ష్మణ్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు

నంగునూరు సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

- ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూరు అక్టోబర్ 29(ప్రజా జ్యోతి):- మండల కేంద్రమైన నంగునూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 30 పడకల నుంచి 50 పడకలకు పెంచాలని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు ఆసుపత్రి స్థాయిని పెంచి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నంగునూరు మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గతంలోనే నంగునూరు సీహెచ్‌సీని 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా చేయాలన్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దామోదర రాజనర్సింహ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నంగునూరు సీహెచ్‌సీ సామర్థ్యాన్ని 50 పడకలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తుచేశారు. ఇందుకు అనుగుణంగా ఆసుపత్రి భవన నిర్మాణం కోసం రూ.8.76 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టి పూర్తి చేసినప్పటికీ, ఆసుపత్రి మాత్రం ఇప్పటికీ 30 పడకల సామర్థ్యంతోనే కొనసాగుతోందని యాదగిరి అన్నారు. 50 పడకల ఆసుపత్రికి అనుగుణంగా భవన నిర్మాణం జరిగినప్పటికీ, అందుకు అవసరమైన వైద్య సిబ్బంది, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య చికిత్సల కోసం ఈ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర వైద్యం, గర్భిణులకు ప్రసూతి సేవలు, చిన్నపిల్లల వైద్యం, ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స, ఇతర అనారోగ్య సమస్యల పరిష్కారానికి స్థానికంగా మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. ఆసుపత్రిలో పడకల సంఖ్య పెరిగితే ఎక్కువ మంది రోగులకు ఒకేసారి వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని, మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటతో పాటు ఇతర పట్టణాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం కొంతవరకు తగ్గుతుందని తెలిపారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల పేద, మధ్యతరగతి ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు సకాలంలో వైద్యం పొందేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. గతంలోనే 50 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచేందుకు ఉత్తర్వులు జారీ కావడం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం, భవన నిర్మాణం పూర్తికావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దేవులపల్లి యాదగిరి కోరారు. ఆసుపత్రిని 50 పడకల సామర్థ్యంతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన పరిపాలనా అనుమతులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది నియామకాలు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకొని నంగునూరు సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.దిం తో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొమురవెల్లి మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- మండల అధ్యక్షుడిగా దేవులపల్లి గిరిబాబు, ప్రధాన కార్యదర్శిగా గ్యార ప్రవీణ్ కుమార్ ఎన్నిక

కొమురవెల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కొమురవెల్లి మండల మహాసభలు సిద్దిపేట పట్టణంలోని కార్మిక, కర్షక భవన్‌లో మండల అధ్యక్షుడు ఎన్. బిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. యాదగిరి, జిల్లా కోశాధికారి ఎం. కృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా 2026--27 సంవత్సరానికి సంబంధించి 22 మందితో కూడిన టీఎస్‌యూటీఎఫ్ కొమురవెల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎం. కృష్ణ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. యాదగిరి వ్యవహరించారు. అనంతరం నూతన మండల ఆఫీస్ బేరర్లు, కార్యదర్శులు, కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు.నూతన మండల ఆఫీస్ బేరర్లుఅధ్యక్షుడు: దేవులపల్లి గిరిబాబు (ఎస్జీటీ), ఎంపీపీఎస్ గురువన్నపేట.ప్రధాన కార్యదర్శి: గ్యార ప్రవీణ్ కుమార్ (ఎస్ఏ బయోసైన్స్), జెడ్పీహెచ్ఎస్ కొమురవెల్లి. ఉపాధ్యక్షుడు: సీహెచ్. చంద్రారెడ్డి (ఎస్ఏ సోషల్), జెడ్పీహెచ్ఎస్ గురువన్నపేట.ఉపాధ్యక్షురాలు: ఆర్. విజయలక్ష్మి (ఎస్ఏ మ్యాథ్స్), జెడ్పీహెచ్ఎస్ మర్రిముచ్చాల.కోశాధికారి: ఎం.డి. అశ్రఫ్ (ఎస్ఏ సోషల్), తపాసుపల్లి.ఆడిట్ కమిటీ కన్వీనర్: ఈ. తిరుపతి, ఎంపీపీఎస్ కొమురవెల్లి. కార్యదర్శులుగా ఎన్నికైనవారుఎన్. బిక్షపతి (ఎస్జీటీ, జెడ్పీహెచ్ఎస్ గురువన్నపేట), జి. కృష్ణంరాజు (ఎస్ఏ ఇంగ్లీష్, జెడ్పీహెచ్ఎస్ కొమురవెల్లి), కె. మంగ (ఎస్జీటీ, ఎంపీపీఎస్ రాంసాగర్) కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుటీ. లక్ష్మయ్య (ఎస్ఏ హిందీ, ఎంపీయూపీఎస్ తపాసుపల్లి), ఎం. శివుడు (ఎస్ఏ బయోసైన్స్, జెడ్పీహెచ్ఎస్ ఐనాపూర్), జి. కవిత (ఎస్ఏ సోషల్, ఎంపీయూపీఎస్ గౌరాయిపల్లి), సీహెచ్. కనకయ్య (ఎస్ఏ తెలుగు, జెడ్పీహెచ్ఎస్ మర్రిముచ్చాల), కె. రజిత (ఎస్జీటీ, ఎంపీపీఎస్ ఐనాపూర్), ఏ. మంజుల (ఎస్ఏ తెలుగు, ఎంపీయూపీఎస్ గౌరాయిపల్లి), పి. అర్పిత (ఎస్జీటీ, ఎంపీపీఎస్ కొమురవెల్లి), కె. మౌనిక (సీఆర్టీ బయోసైన్స్, కేజీబీవీ కొమురవెల్లి), ఎం. రమేష్ (ఎస్ఏ బయోసైన్స్, జెడ్పీహెచ్ఎస్ గురువన్నపేట), టీ. స్టాన్లీ బాబు (ఎస్జీటీ, ఎంపీపీఎస్ ఐనాపూర్), మమత (సీఆర్టీ తెలుగు, కేజీబీవీ కొమురవెల్లి), మహేందర్ రెడ్డి (ఎస్జీటీ, ఎంపీయూపీఎస్ తపాసుపల్లి), హారిక (ఎస్జీటీ స్పెషల్, కొమురవెల్లి)లను మండల కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మహాసభల సందర్భంగా నూతన కమిటీ ఎన్నికను ప్రకటిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ, విద్యారంగ అభివృద్ధి వంటి అంశాల్లో సంఘం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కొమురవెల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):- కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మికి రూ.13,000, కాపర్తి కృష్ణమూర్తికి రూ.45,000 ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులను సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరయ్యేలా సహకరించిన జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి బాధిత కుటుంబాల తరపున బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సిలివేరు సిద్ధప్ప, ఏర్పుల మహేష్, గొల్లపల్లి ఆంజనేయులు, గొల్లపల్లి కిష్టయ్య, పోతుగంటి శ్రీనివాస్, సిలివేరు కనకమల్లేష్, గొల్లపల్లి నాగరాజు, పోట్లచెరువు తిరుపతి, మారగోని రాజు గౌడ్, అంబటిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షకు తావులేకుండా సమానత్వ సమాజాన్ని నిర్మించాలి

- అన్ని వర్గాలకు సమాన గౌరవం కల్పించాలి
- సామాజిక సామరస్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- రాజ్యాంగ హక్కులపై గ్రామస్తులకు అవగాహన: డీఎస్పీ నరేందర్ గౌడ్

తూప్రాన్,(ప్రజాజ్యోతి) అక్టోబర్ 29: సమాజంలో కులవివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలను పూర్తిస్థాయిలో నిర్మూలించి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం కల్పించే దిశగా ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని, వివక్షకు తావులేని సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో

సివిల్ రైట్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వపు హక్కును కల్పించిందని, కులం, మతం ఆధారంగా ఎవరిపట్ల వివక్ష చూపడం సరికాదని స్పష్టం చేశారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతోపాటు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.కులవివక్ష, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలు సమాజ ప్రగతికి ఆటంకమని పేర్కొంటూ, వాటి నిర్మూలనకు ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ సూచించారు. ఎక్కడైనా పౌర హక్కులకు భంగం కలిగించే ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇతరుల హక్కులను గౌరవిస్తూ, సమానత్వం, సోదరభావం, పరస్పర సహకారంతో మెలగాలని పిలుపునిచ్చారు. గ్రామంలో సామాజిక సామరస్యాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ముందుకు సాగాలని, శాంతిభద్రతల పరిరక్షణతోపాటు గ్రామాభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కులవివక్ష, సామాజిక అసమానతలకు తావులేకుండా పరస్పర గౌరవంతో మెలుగుతూ, గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సమాన హక్కులు, సామాజిక న్యాయం, మానవ గౌరవం పరిఢవిల్లినప్పుడే అభివృద్ధి చెందిన సమాజం సాధ్యమవుతుందని ఈ కార్యక్రమంలో సందేశాన్నిచ్చారు. ఈ సమావేశంలో తూప్రాన్ ఎస్ఐలు వి. గంగరాజు, మధుసూదన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, ఎస్సీ కమ్యూనిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ కులాలకు చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

- గ్లోబల్ స్టీల్, ఐటీసీ పరిశ్రమలను సందర్శించిన వెల్దుర్తి విద్యార్థులు
- వృత్తి విద్యకు ఆచరణాత్మక అనుభవం జోడిస్తూ ముందడుగు

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 29: పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పారిశ్రామిక రంగంలోని వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేలా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించింది. వృత్తి విద్యలో భాగంగా గురువారం నిర్వహించిన పారిశ్రామిక సందర్శనలో 9, 10వ తరగతుల విద్యార్థులు కూచారంలోని గ్లోబల్ స్టీల్ ఇండస్ట్రీ, మనోహరాబాద్‌లోని ఐటీసీ పరిశ్రమలను

సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో ఉపయోగించే ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలు, ముడి పదార్థాల నుంచి తుది ఉత్పత్తుల తయారీ వరకు జరిగే వివిధ ప్రక్రియలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. ఉత్పత్తుల నాణ్యత పరిశీలన, యంత్రాల నిర్వహణ, పరిశ్రమల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల ప్రాధాన్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను పరిశ్రమల్లో గమనించడంతో విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో సాంకేతిక అంశాలపై ఆసక్తిని పెంచడంతో పాటు భవిష్యత్తులో వృత్తి ఎంపిక, ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధిపై స్పష్టమైన అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకున్న విషయాలు విద్యార్థుల ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పారిశ్రామిక సందర్శనకు అవకాశం కల్పించి, పరిశ్రమల పనితీరును వివరించిన గ్లోబల్ స్టీల్ ఇండస్ట్రీ ఫ్యాక్టరీ మేనేజర్ ఆనంద్ జడి, మేనేజర్ శివం కారా, హెచ్‌ఆర్ సరహాకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే కార్యక్రమం విజయవంతానికి సహకరించిన మనోహరాబాద్ మండల విద్యాధికారి వెంకట్ స్వామి గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేసింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్యతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రీ సర్వేపై ఎలాంటి అపోహాలొద్దు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- ఏక్లాస్‌పూర్‌లో భూభారతి భూముల రీ సర్వే గ్రామసభ

టేక్మాల్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) గ్రామంలో చేపట్టే భూభారతి రీ సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఏక్లాస్‌పూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి భూముల రీ సర్వే గ్రామసభకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రీ సర్వే ద్వారా గ్రామంలోని ప్రతి రైతు భూమికి పటిష్టంగా, స్పష్టమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. ఏక్లాస్‌పూర్ గ్రామంలోని మొత్తం 718 ఎకరాల్లో ఈ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఒకవేళ ఏవైనా భూ సమస్యలు ఉంటే, సర్వేకు 60 రోజుల ముందే నోటీసులు జారీ చేసి పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, అటవీ (ఫారెస్ట్), అసైన్డ్, చెరువులు, కుంటల భూములను సర్వే చేస్తామని, ఆ తర్వాతే పట్టా భూముల రీ సర్వే చేపట్టి ఎలాంటి భూ తగాదాలు లేకుండా తీర్చిదిద్దుతామని వివరించారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ సర్వే ఎంతో దోహదపడుతుందని, స్థానిక ప్రజలు, రైతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని అన్నారు.వారం రోజుల్లో సర్వే ప్రారంభం: ఏడీ సర్వే కిషన్ ఏడీ సర్వే కిషన్ మాట్లాడుతూ.. గ్రామంలో వారం రోజుల్లోగా రీ సర్వే పనులను ప్రారంభిస్తామని, ప్రతి భూకమతానికి పక్కాగా హద్దులు నిర్ధారించేందుకు చేపట్టే ఈ కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని కోరారు. అనంతరం మెదక్ ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ.. రీ సర్వేకు సంబంధించి రైతులకు ఎలాంటి సందేహాలు లేదా సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరామ్, సర్పంచ్ యశోద ఆంజనేయులు, ఉప సర్పంచ్ భూమయ్య, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాఘవపూర్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని ఆకస్మిక మృతి

- గుడికందులకు చెందిన పదో తరగతి విద్యార్థిని లాస్య మృతి పై విచారణ జరపాలని డిమాండ్

తొగుట, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): తొగుట మండలంలోని గుడికందులకు చెందిన దావులగల్ల లాస్య సిద్దిపేట మండలం రాఘవపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా బుదవారం హాస్టల్ లో ఆకస్మికంగా మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆరోగ్యంగా ఉన్న లాస్య దసరా సెలవుల అనంతరం యథావిధిగా హాస్టల్‌కు వెళ్లి అనూహ్యంగా ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర విషాదానికి గురిచేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పాఠశాల నుంచి లాస్య తల్లిదండ్రులకు ఫోన్ వచ్చిందని, లాస్య పుష్పవతి అయిందని సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారని, గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో హాస్టల్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు, అప్పటికే లాస్య ఆరోగ్యం క్షీణించడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. అయితే ఆసుపత్రికి చేరుకునే సమయానికే లాస్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా ఉన్న తమ కుమార్తె ఆకస్మికంగా మృతి చెందడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాస్య మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం లాస్య మృతదేహం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలోనే ఉంది.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిగి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ కావాటి మల్లేష్, చైర్‌పర్సన్ కుడుముల రజిత గురువారం పరిశీలించారు. పట్టణంలోని అమృత్ 2.0 పథకం కింద నిర్మిస్తున్న నీటి ట్యాంక్, ఓల్డ్ సిద్ధాంత కాలనీ, 11వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలో మురుగు కాలువల నిర్మాణ పనులతో పాటు నూతన మున్సిపల్ భవన నిర్మాణ పనులను వారు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని వారు

తెలిపారు. ముఖ్యంగా మురుగు కాలువల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, కౌన్సిలర్ ఎజాజ్, అధికారి నర్సింగ్ రావు, నాయకుడలు కుడుముల వెంకటేష్‌తో పాటు సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

దౌలాపూర్ భూ బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

యాలాల్ అక్టోబర్ 28 ప్రజా జ్యోతి
యాలాల.... దౌలాపూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని యాలల మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరియం చెల్లించాలంటూ గత మూడు రోజులుగా మండల పరిషత్ కార్యాలయం ముందు బాధిత రైతులు రిలే నిరాహారదీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షకు టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని అన్నారు బాధిత రైతులకు ఎలాంటి నష్టపరిహారం లేకుండా అక్కడ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం సొంత జిల్లాలోని ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్న నష్టపరిహారం చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు వెంటనే జిల్లా కలెక్టర్ అక్కడికి సందర్శించి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల్ మల్కయ్య ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు మహేందర్ టిఆర్ఎస్ నాయకులు అరవింద్ కుమార్ రెడ్డి, సంగం కుర్దు లాలు ముదిరాజ్, డెవలపర్ శ్రీనివాస్ యాదవ్, మహేష్ రెడ్డి, శ్రీశైలం, బెన్నూర్ మాజీ సర్పంచ్ పటేల్ రెడ్డి, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

రోడ్డు ప్రమాదంలో బైక్ యాంకర్ మృతి

యాలాల్ అక్టోబర్ 29 ప్రజాజ్యోతి:
యలల... రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.. ఈ

సంఘటన గురువారం యలల మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దౌలాపూర్ గ్రామం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న లారీ బైక్ ఢీకొని బైక్ పైన వ్యక్తి మృతి చెందాడని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తునట్లు పోలీసులు తెలిపారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉప్పల్, అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి):
కుషాయిగూడ డివిజన్ పరిధి లోని వాసవీ శివనగర్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు.శివాలయం లో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాల తో ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారి ని కోరుకుంటున్నట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

పట్టభద్రుల ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ నిర్లక్ష్యం చేయొద్దు

ఫారం–18 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

తాండూరు అక్టోబర్ 29 ప్రజా జ్యోతి :
పుట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆన్లైన్ ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకున్న దరఖాస్తుదారుల నుండి ఫారం 18 పూర్తి చేసేందుకు నిర్లక్ష్యం చేయొద్దని తాండూర్ ఆర్డీవో అనిత అధికారులకు సూచించారు. గురువారం రోజు ఆర్డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డిఓ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, మహబూబ్నగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు గాను ఎన్నికల ఫారం–18 దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెల వచ్చే నెల నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను చేసేందుకు అవకాశం ఉంది అన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల వివరాల పూర్తి నమోదు కోసం పారదర్శకంగా పరిశీలన చేసి ఏఈఆర్ఓ కార్యాలయానికి పంపించాలని సూచించారు. భౌతికంగా స్వీకరించిన ఫారం–18 దరఖాస్తులను కార్యాలయంలోని రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో అదే రోజు డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ధృవీకరించి, నిర్ణీత

గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల నిబంధనలను పాటిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాండూరు ఆర్డీవో కోరారు.

పత్తి పంట పొలాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

ప్రత్తి పంటసాగులో క్షేత్ర పరిశీలన తీసుకోవాల్సిన జాగ్రత్తలు

బిజ్వారులో మిషన్ ఫర్ కాటన్ పథకం అమలు చేశాం

తాండూర్ మండల వ్యవసాయ అధికారి కొమురయ్య

తాండూరు అక్టోబర్ 29 ప్రజాజ్యోతి :
తాండూర్ మండలం బిజ్వార్ గ్రామంలోని పత్తి పంట పొలాన్ని వ్యవసాయ అధికారులు పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ

అధికారి కొమరయ్య మాట్లాడుతూ (ప్రొడక్టివిటీ స్కీమ్) రైతులకు పత్తి పంట పొలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అదేవిధంగా సమయానుకూలంగా పత్తి పంటపై పిచికారి చేయవలసిన మందుల విషయమై అన్ని విధాల సూచనలు చేస్తూ పంట చేతికి వచ్చేవరకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఖరీప్ సీజను ప్రారంభంలో నే పత్తి విత్తనాలు పంపిణీ చేసిన తదుపరి ప్రత్తి పంట పొలంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఏడాది వానాకాలం ప్రారంభంలో రైతులకు రాసీ స్విఫ్ట్ 929 అనే హైబ్రిడ్ పత్తి విత్తనాలను రైతులకు ఉచితంగా 256 ప్యాకెట్లను ఇవ్వడం జరిగిందన్నారు. పత్తిలో కాయ దశ ఉన్న సమయంలోనే పోషక మందులను, పురుగు మందులను కూడా రైతులకు రాయితీ ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేయడంతో సాధారణంగా వచ్చే దిగుబడుల కంటే 3 రెట్లు దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల వ్యవసాయాధికారి కొమురయ్య, వ్యవసాయ విస్తరణాధికారి సుమ, రాసీ పత్తి విత్తనాల కంపెనీ వికారాబాదు మేనేజర్ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానం

హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదానం

శంషాబాద్ నుంచి 40 మంది రక్తదానం

రాజేంద్రనగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)
రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానం అని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ అన్నారు. పోలీసు అమరవీరుల

సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని సిటీ ట్రైనింగ్ కాలేజీ పట్లబురుజులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో శంషాబాద్‌కు చెందిన ట్రాఫిక్ పోలీసులు, ట్రాఫిక్ మార్షల్స్, యువత కలిపి సుమారు 40 మంది రక్తదానం చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీ–3 రాహుల్ హెగ్డే,అడిషనల్ డీసీపీ రాములు, శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాసేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన శంషాబాద్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, మార్షల్స్, యువతను అభినందించారు. శంషాబాద్

ఏసీపీ నాగభూషణం మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన సిబ్బందిని అభినందించారు. ప్రజల భద్రతతో పాటు సమాజ సేవలోనూ పోలీసులు ముందుండటం అభినందనీయమన్నారు. శంషాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ శంషాబాద్ నుంచి సుమారు 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం సంతోషంగా ఉందని, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ మార్షల్స్, యువత చురుకుగా పాల్గొనాలని కోరారు.

రూ.3.13 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి):
ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా వాసవి

శివనగర్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రూ.3 కోట్ల 13 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారులు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

ఉచిత దంత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్

కొత్తూరు అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):
ఉచిత దంత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు.గురువారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నాట్కో ట్రస్ట్ డాక్టర్ జగదీశ్వర్

రావు ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ క్యాంపులో 300 మందికి ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుంది.దంత సమస్యలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంగూర్ నాయక్,డాక్టర్స్,నాట్కో ట్రస్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్

రాజేంద్రనగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)
రక్తదానం చేయండి – ప్రాణదాతలు కండి అని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని బేగం

గార్డెన్లో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్, ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, సీఐ సంజీవ్ పాల్గొని రక్తదానం చేశారు. వారితో పాటు పోలీస్ సిబ్బంది, స్థానికులు కలిపి 60 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీసీపీ రాజేష్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం వారు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అందరి సహకారంతో పెంజర్లను అభివృద్ధి చేస్తా

సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్

కొత్తూరు అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):
అందరి సహకారంతో పెంజర్లను అభివృద్ధి చేస్తానని సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. గురువారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిసి

రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి హాజరై సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉప సర్పంచ్ శాంతన్ రెడ్డి, వార్డ్ సభ్యులు మామిడి భారతమ్మ,మంద మాధవి, ఆకలపల్లి మాధవి,దేశాల శారద,కె వేదంతా చారి, అర్బాస్,కటిక మై బుజ్జి,కట్నం రమాదేవి,డీలర్ రాజేందర్ రెడ్డి, దేశాల జైపాల్,సహదేవ్,మంద శ్రీను,దేశాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టాప్-10 ఇన్నోవేటివ్ టీచర్లలో పారమిత ఉపాధ్యాయుడు

తెలంగాణ నుంచి ఏకైక ఉపాధ్యాయుడిగా లలిత్ మోహన్ సాహు ఎంపిక

కరీంనగర్, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు, ప్రాజెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ లలిత్ మోహన్

సాహు జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించారు. దేశంలోని టాప్–10 వినూత్న ఉపాధ్యాయుల్లో ఒకరిగా ఎంపికై, తెలంగాణ నుంచి ఈ గుర్తింపు పొందిన ఏకైక ఉపాధ్యాయుడిగా నిలిచారు. అక్టోబర్ 28న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు 'వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్–2026' అందజేశారు. దేశవ్యాప్తంగా వచ్చిన సుమారు 37 వేల దరఖాస్తుల నుంచి నిపుణుల బృందం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఆయన ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు రూ.లక్ష విలువైన ఫెలోషిప్ గ్రాంట్ కిట్‌ను అందించారు. గత 25 ఏళ్లుగా పారమిత విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న లలిత్ మోహన్ సాహు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందిస్తున్నారు. ఆయన విజయంపై పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావుతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

పంటల వైవిధ్యంతోనే రైతులకు భరోసా!

శానబండలో ఖేత్ బచావో అభియాన్

ఎండపల్లి, అక్టోబర్ 29, ప్రజా జ్యోతి: రైతులు సేంద్రియ వ్యవసాయం, భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. గురువారం ఎండపల్లి మండలం శానబండలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున, వాతావరణానికి అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు సూచించారు. మట్టి

పరీక్షలు చేయించుకొని, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు.కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఏటీఎంఏ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.సందీప్, సర్పంచి గాధం భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్దపీట.. అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే పరిశుభ్రమైన పట్టణం: ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి. జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం పోక్సో చట్టం, 2012పై విద్యార్థినులకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీమతి సరిత మట్టా ఈ కార్యక్రమంలో పాల్గొని, పోక్సో చట్టంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగిక

వేధింపులు, లైంగిక దాడులు, లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు పోక్సో చట్టాన్ని రూపొందించినట్లు వివరించారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించి ఈ చట్టంలో కఠినమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు తమ శరీరంపై తమకు హక్కు ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎవరైనా అనుచితంగా తాకినా, అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక ఉద్దేశంతో బెదిరించినా లేదా ఆన్‌లైన్‌లో అసభ్యకరమైన సందేశాలు పంపినా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన సమాచారం అందినప్పుడు చట్ట ప్రకారం సంబంధిత అధికారులకు నివేదించడం ముఖ్యమని పేర్కొన్నారు. బాధిత పిల్లల గోప్యతను కాపాడటంతో పాటు, వారికి గౌరవప్రదమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. పిల్లల భద్రత కుటుంబం, పాఠశాల, సమాజం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తమ చట్టపరమైన హక్కులు, లైంగిక వేధింపులను గుర్తించడం, వాటిని ధైర్యంగా నివేదించడం, సురక్షిత వాతావరణంలో విద్యను కొనసాగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ) సురేష్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనది...

స్ట్రోక్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో చేర్చడం వల్ల మెరుగైన ఫలితం

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి): స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత త్వరగా స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి తీసుకెళితే మెరుగైన ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు వెల్లడించారు. స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం విలువైనదని, లక్షణాలు కనిపించిన వెంటనే స్పందించాలని సూచించారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంజయ్ కమిన్వర్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్ కేర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి పాల్గొని స్ట్రోక్‌పై అవగాహన కల్పించారు. మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా మెదడులో రక్తనాళం చిట్లడం వల్ల స్ట్రోక్ సంభవిస్తుందని వివరించారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి, కాలు కదల్చకపోవడం, మాట తడబడటం, అకస్మాత్తుగా చూపు మందగించడం, బ్యాలెన్స్ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడం, రక్తస్రావం జరగడం అనే రెండు ప్రధాన రకాలుంటాయని తెలిపారు. నాలుగున్నర గంటలలోపు సీటీ, ఎమ్మారై స్కాన్, క్యాథలాబ్ సౌకర్యమున్న స్ట్రోక్‌రెడీ ఆసుపత్రికి తీసుకువస్తే ఐవీ త్రోంబొలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డను కరిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆలస్యం చేయడం వల్ల వైకల్యంతో

పాటు ప్రాణాలకే ప్రమాదమన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని తెలిపారు. రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా ముప్పును తగ్గించుకోవచ్చన్నారు. అన్ని విభాగాల వైద్యులు, పరికరాలు సిద్ధంగా ఉన్న స్ట్రోక్ రెడీ మెడికవర్ ఆసుపత్రిలో వేగవంతమైన పరీక్షలు, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలు అందడం మూలంగా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ హెడ్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ యం.మంగ

రామయ్యపల్లిలో ఉచిత కంటి పరీక్ష కేంద్రం ప్రారంభం:

ధర్మారం,అక్టోబర్ 25 (ప్రజా జ్యోతి న్యూస్):ధర్మారం మండలం రామయ్యపల్లి గ్రామంలో కోలుముల దామోదర్ యాదవ్ (ఎన్నారై) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మూల మంగ మల్లేశం గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందించడం మరింత సంతోషకరమైన విషయమని,ఈ సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి సేవలు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా,ప్రజలకు సేవలందించిన కోలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్‌కు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంటి పరీక్షల నిపుణులు డాక్టర్ సంతోష్ కుమార్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత ప్రతి ఉద్యోగి బాధ్యత

అవినీతి రహిత పాలనకు సమష్టి కృషి అవసరం

జగిత్యాల, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి: విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదా

యంలోని సమావేశ మందిరంలో అవగాహన సమావేశం, సమగ్రత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమైనవని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ అవసరాల కోసం వచ్చే ప్రజలకు నిబంధనల ప్రకారం సకాలంలో సేవలు అందించాలని, విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి, ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అవినీతి నివారణ అనేది ఒక్క శాఖ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ఉద్యోగులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే అవినీతి రహిత సమాజాన్ని నిర్మించగలమని వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శక విధానాలను పాటించడం, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించడం, దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించడం ద్వారా మెరుగైన పాలన అందించవచ్చని పేర్కొన్నారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐ ప్రేమ్ అవినీతి నివారణ, ఉద్యోగుల నైతిక బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన విలువలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే క్రమంలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. విధులను నిజాయితీతో నిర్వహిస్తూ, అవినీతిని నిరోధించేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు

విద్యార్థినులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి సరిత మట్టా.

జగిత్యాల, అక్టోబర్ 29, ప్రజాజ్యోతి. జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం పోక్సో చట్టం, 2012పై విద్యార్థినులకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శ్రీమతి సరిత మట్టా ఈ కార్యక్రమంలో పాల్గొని, పోక్సో చట్టంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలను లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు పోక్సో చట్టాన్ని రూపొందించినట్లు వివరించారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించి ఈ చట్టంలో కఠినమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు తమ శరీరంపై తమకు హక్కు ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎవరైనా అనుచితంగా తాకినా, అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక ఉద్దేశంతో బెదిరించినా లేదా ఆన్‌లైన్‌లో అసభ్యకరమైన సందేశాలు పంపినా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన సమాచారం అందినప్పుడు చట్ట ప్రకారం సంబంధిత అధికారులకు నివేదించడం ముఖ్యమని పేర్కొన్నారు. బాధిత పిల్లల గోప్యతను కాపాడటంతో పాటు, వారికి గౌరవప్రదమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. పిల్లల భద్రత

కుటుంబం, పాఠశాల, సమాజం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తమ చట్టపరమైన హక్కులు, లైంగిక వేధింపులను గుర్తించడం, వాటిని ధైర్యంగా నివేదించడం, సురక్షిత వాతావరణంలో విద్యను కొనసాగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ) సురేష్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్నకొండ రైతువేదికలో ఖేత్ బచావో అభియాన్

చొప్పదండి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): చొప్పదండి మండలం అర్నకొండ రైతు వేదికలో గురువారం ఖేత్ బచావో అభియాన్–2026 కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి చత్రూ నాయక్ మాట్లాడుతూ భూసార పరిరక్షణ, భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు వివరించారు.పంట అవశేషాలను కాల్చకుండా పొలంలోనే కలియ దున్నాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాల్సిన ఆవశ్యకతను వివరించారు.రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, సాగు ఖర్చులను తగ్గించుకొని, నీరు, ఇతర సహజ వనరులను సమర్థవంతంగావినియోగించుకోవాలని సూచించారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంపొందించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, అర్నకొండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి యోగేష్, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో చలోకరీంనగర్ సన్నాహక సమావేశం

వేములవాడ,అక్టోబర్,29:ప్రజాజ్యోతి: వేములవాడ పట్టణం లోని స్థానిక పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటుచేసిన బిజెపి పట్టణ సమావేశంలో అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీ గురువారం కరీంనగర్లో బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగే మహాపాదయాత్రను

విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని విచ్చిన్నం చేసే విధంగా విద్రోహశక్తులు చేస్తున్న ఆగడాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా 5వ తారీఖున కరీంనగర్లో జరిగే కార్యక్రమానికి యువకులు పెద్ద ఎత్తున నరేంద్ర మోడీకి మద్దతుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన చిట్యాల రాజు ను పట్టణ బిజెపి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నేరెళ్ల సాయికుమార్ ను పట్టణ ఎండోమెంట్ కమిటీ కన్వీనర్గా ఎన్నికైన రేణు కింద అశోక్ కో కన్వీనర్ బిల్లా.కృష్ణను చాలువతో సత్కరించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోల కృష్ణస్వామి నాయకులు రేగుల మల్లికార్జున్ కౌన్సిలర్ కొండ్లిపు ముత్యం నాయకులు రేగుల శ్రీకాంత్ వాసం మల్లేశం యాదవ్ రేగుల రాజకుమార్ వివేక్ రెడ్డి ఎడ్ల కమలాకర్ కటకం శ్రీనివాస్ చిక్కుడు మల్లేశం చేపూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు

సకల సదుపాయాలకు నిలయం సర్కారు బడి

వేములవాడ,అక్టోబర్,29:ప్రజాజ్యోతి. ప్రభుత్వం పరంగా అందించే ఉచిత షూ లను ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలోని విద్యార్థులకు కౌన్సిలర్ ధూమ్ మధు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ ధూమ్ మధు మాట్లాడుతూ "నాడు సర్కార్ బడుల్లో చదివిన వారు నేడు ఉన్నత స్థానంలో ఉన్నారని, బడి అంటేనే భవిష్యత్తుకు బాటలు వేసే గుడి అని, పిల్లలు ఆంగ్ల మాధ్యమం చదవాలన్నా, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నా ప్రైవేట్ పాఠశాలల్లోనే చేర్పించాలనే ఆలోచన తల్లిదండ్రులకు ఉండేదని, కానీ నేడు ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత

పదవుల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు సకల సదుపాయాల కల్పనకు నిలయంగా మారాయని, ఎంతోమంది విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకుంటున్నారని, సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు రూపాయి ఖర్చు లేకుండా సుశిక్షితులైన అధ్యాపకులచే ప్రీ ప్రైమరీ నుండి డిగ్రీ వరకు ఉచిత నాణ్యమైన చదువును అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న కాలంతో పాటు నేడు ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక వసతులతో డిజిటల్ విద్యను అందిస్తుందని, ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాలు, టై, బెల్ట్ మరియు బూట్లను ఉచితంగా అందజేస్తుందని, సర్కారు బడి విద్యార్థులందరికీ రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం (వారానికి మూడు గుడ్లు), బెల్లం పల్లి పట్టీలు, రాగి జావా ద్వారా పిల్లల ఆరోగ్య ఎదుగుదలకు తోడ్పడుతుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు పాసులు ఉచితంగా ఇస్తారని, నేడు చాలా ప్రభుత్వ బడులలో కంప్యూటర్ ల్యాబ్ లు, ప్రొజెక్టర్ ల ద్వారా డిజిటల్ విద్యను బోధిస్తున్నారని, ప్రైవేట్ స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ స్కూళ్లకు పెద్ద ఆట స్థలాలు ఉంటాయని, ఇది పిల్లల శారీరక, మానసిక వికాసానికి, క్రీడల్లో రాణించడానికి సహాయపడుతుందని, కార్పొరేట్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందని, ప్రభుత్వం అందించే సకల సదుపాయాలతో సర్కార్ బడుల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెరుగుతుందని, సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పించే సకల సదుపాయాలతో విద్యార్థుల్లో న్యూనతాభావం తగ్గి,ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం రోజురోజుకు రెట్టింపై ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొప్పరి భాస్కర్, నాగవెల్లి శేఖర్, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ నినో పట్ల గ్రామస్తులకు అవగాహన

• సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో సమావేశం

చింతకాని అక్టోబర్ 29ప్రజాజ్యోతి (ప్రతినిధి) ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుపై ఆగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. చింతకాని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు వివరించారు. పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు మాట్లాడుతూ గ్రామంలో నెలకొనే సమస్యలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే విది విధానాలు రైతులు మరియు గ్రామ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోలా ఉ మారాణి, సెక్రెటరీ రమేష్ బాబు వార్డ్ మెంబెర్స్, వ్యవసాయ, విద్యుత్, రెవిన్యూ అధికారులు, గ్రామ నాయకులు ప్రజలు సమావేశంలో పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఖమ్మం రూరల్ మండలంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్ హాల్లో దానవాయిగూడెం (59వ డివిజన్)కు చెందిన ముమ్మడి రాజయ్య చారి కుమారుడి వివాహానికి మంత్రి హాజరై..వధూవరులను ఆశీర్వదించి శు

భాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలోని ఎంబీ గార్డెన్స్‌లో ఏదులాపురం మున్సిపాలిటీ నాయుడుపేటకు చెందిన తమ్మనబోయిన శ్రీను కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో..: ఏదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాప్షన్ లెస్ కార్టూన్స్ పోటీలో సుభాని కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి

కొత్తగూడెం కలెక్టరేట్ పాల్వంచ / అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి) రాష్ట్ర స్థాయి కాప్షన్ లెస్ కార్టూన్స్ పోటీలో పాల్వంచకు చెందిన షేక్ సుభాని కార్టూన్ కు ప్రతీక బహుమతి లభించింది. పాలపర్తి రాజగోపాల్-ఉమాదేవి స్మారకార్థం ప్రముఖ హాస్య మాస పత్రిక హాస్యానందం నిర్వహించిన కాప్షన్ లెస్ కార్టూన్ పోటీలో సుభాని కార్టూన్ ప్రత్యేక బహుమతి గెలుచుకుంది. హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ

మాజీసలహాదారు డాక్టర్ కే.వి.రమణ కార్టూనిస్ట్ సుభాని కి నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు.. ఈ సందర్భంగా సుభాని ని డాక్టర్ రమణా చారి, హాస్యానందం ఎడిటర్ రాము తో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కవి, చిత్ర కారులు బీనిమ్, రంగస్థల నటులు సుబ్బరాయశర్మ, సత్యనారాయణ పలువురు కార్టూనిస్ట్ లు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

• ఖమ్మం రూరల్ మండలం చింతపల్లిలో రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఎల్నినో ప్రభావం వలన వర్షభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలు తగ్గడం, వచ్చే ఏడాది ఆగస్టు వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కూరగాయలు, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని తేమతో పండే పంటలను ఎంచుకోవాలని అన్నారు. పశువుల దాణా సమస్య తలెత్తకుండా ఉచిత పశుగ్రాస విత్తనాల కిట్లను అందిస్తున్నామని అన్నారు. వర్షభావం దృష్ట్యా ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ. 308 ల కూలీతో ఎక్కువ పనిదినాలు కల్పిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను, రైతులను వేధిస్తున్న కోతుల బెడదపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, తగిన నివారణ చర్యలు చేపడతామని కలెక్టర్ అన్నారు. ప్రాంతీయంగా వలస వస్తున్న నైజీరియా కొంగలు సంరక్షణ కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను చేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. హౌ ఇప్పటికే మొదటి, రెండో విడతలు మంజూరయ్యాయని, మూడో, నాలుగో, ఐదో విడతలు మంజూరు అవుతాయని, ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎంబిసి ఎన్నికల దృష్ట్యా, అక్టోబర్ 31, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఫారమ్-18 ద్వారా వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు కు నవంబర్ 6 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఓటరు లిస్టులో నమోదు చేసుకున్న, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు దరఖాస్తు తప్పనిసరి అని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని, ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో రైతులడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖల అధికారులు రైతులకు ఎల్నినో ప్రభావం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, ఇరిగేషన్ డిఈ రాజేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయ అధికారి సురేష్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

• జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ • అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా సమన్వయంతో అధికారులు ముందుకు సాగాలి

• ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి నియోజకవర్గం లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గం ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లి లో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత సమయానికి, క్వాలిటీ తో వేగంగా నిర్మాణాలు జరగాలని, కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ విద్య, వైద్యం అభివృద్ధికి కీలకమైన కళాశాల భవనాల నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకుండా, ఇంజనీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పనుల సందర్భంగా అవసరమైన నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, ప్రతి దశను ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆనతరం వెంకటగిరి లో అసంపూర్తిగా ఉన్న జి ప్లస్ 2 భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు వినయేంద్రరెడ్డి, వైద్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

• 14 లక్షల కారుతో కస్టమర్‌కు కుచ్చుటోపీ.. గీతలు పడ్డ కారే కొత్త కార్ అంటూ మోసం..!

• కొత్త కార్ పేరుతో రంగులు మార్చిన కార్..? మారుతీ సుజుకి నెక్సలో ఓ కస్టమర్‌కు ఎదురైన దారుణ అనుభవం..!

• ఏజెన్సీ అమాయకులే టార్గెట్..? సైడ్ మిర్రర్, తాళం మార్చేసి అదే గీతల కారు అంటగట్టే ప్రయత్నం..!

• ఇదిగో కార్.. అదిగో కార్ అంటూ తిప్పించి.. చివరకు గీతలు పడ్డ కారే ఇవ్వబోయరంటు బాధితుడు ఆవేదన..!

• 14 లక్షలు పెట్టి కొనుగోలు చేయాలని చూస్తే ఇంత మోసమా..? మణుగూరులో కార్ షోరూం మోసం బట్టబయలు..!

• కార్ షోరూం నిర్వాహకుల వివరణ

మణుగూరులో మారుతీ కార్ షోరూం దందా...!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 29, ప్రజాజ్యోతి.. పట్టణంలోని మారుతీ సుజుకి నెక్స సంస్థలో ఓ వినియోగదారునికి అపూర్వ అనుభవం ఎదురైంది. సింగరేణి ఉద్యోగి ఓ కస్టమర్ తన స్వంత వాహనం కొనుగోలు చేయాలనే తలంపుతో ఆ షోరూంను ఆశ్రయించాడు. సంస్థ నిర్వాహకులు 14 లక్షల విలువగల వాహనాన్ని ప్రదర్శించారు. దానిని నిశితంగా పరిశీలించిన కస్టమర్ లోపాలను గుర్తించాడు. పార్శ్వ దర్పణంపై గీతలు, తాళపు చెవిపై నొక్కులు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ వాహనం వద్దని, వేరొకటి ఇవ్వాలని కస్టమర్ కోరాడు. నిర్వాహకులు అంగీకరించి నూతన

వాహనం తెప్పిస్తామని హామీ ఇచ్చారు. మరునాడు వాహనం వచ్చిందని కస్టమర్ కి వర్తమానం పంపారు. దీంతో కస్టమర్ వెళ్లి చూడగా అదే వాహనం కనిపించిందని ఆయన ఆరోపించారు. కేవలం దర్పణం, తాళం మార్చి అదే వాహనాన్ని ఇవ్వాలని చూశారాని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు వెచ్చించే వినియోగదారుల పట్ల ఇది తగదని స్థానికులు అంటున్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకోని కార్ షోరూం నిర్వాహకులు భారీ మోసాలకు పాల్పడుతున్నారని స్థానికులు విమర్శలు కురిపిస్తున్నారు.

ఏజెన్సీ అమాయకులే టార్గెట్..? సైడ్ మిర్రర్, తాళం మార్చేసి అదే కారు డెలివరీ సిద్ధం..!

ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. మణుగూరు లాంటి మారుమూల ప్రాంతంలో అవగాహన తక్కువని భావిస్తున్నారా.? అంటే ఓ కస్టమర్ విషయంలో జరిగింది అదేనని తెలుస్తోంది. మొదటి రోజు చూపిన వాహనంలోని లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం ముమ్మాటికీ చేశారు. అద్దాలు మార్చి, తాళం మార్చి కొత్తదిగా చూపించి బురిడి కొట్టించారు. నిజమైన కొత్త వాహనం ఇవ్వకుండా ఇలా చేయడం పట్ల కస్టమర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలని షోరూం నిర్వాహకులను స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మణుగూరులో కార్ కొనాలంటే ఇప్పుడు వందసార్లు ఆలోచించాల్సిన దుస్థితి నెలకొంది. కస్టమరే దేవుడు అంటూ తియ్యని మాటలు చెప్పి లోపల మాత్రం కస్టమర్లనే బకరాలను చేస్తున్నారు. ఓ సింగరేణి కస్టమర్ 14 లక్షలు అప్పు చేసి తన కలల కార్ కొందామని వెళితే గీతలు పడి, వంకర్లు పోయిన కార్ ను అంటగట్టాలని చూశారు. మణుగూరు పట్టణం లోని మారుతీ సుజుకి నెక్స షోరూంలో జరుగుతున్న ఈ దారుణ బాగోతం ఇప్పుడు బట్టబయలు అయింది. కొత్త కార్ పేరుతో గీతలు పడ్డ కార్ ఇచ్చి, కస్టమర్ అడిగితే ఇదిగో కార్, అదిగో కార్ అంటూ నెల రోజులు తిప్పించి, చివరకు అదే కార్ కు సైడ్ మిర్రర్, తాళం మార్చేసి మళ్లీ అంటగట్టబోయిన తీరు కస్టమర్ ని షాక్ కు గురిచేసింది. ఏజెన్సీ ఏరియాలో షోరూం పెట్టి అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు ఇప్పుడు మణుగూరులో హాట్ టాపిక్ గా మారాయి.

ఇదిగో కార్, అదిగో కార్ అంటూ తిప్పించి.. చివరకు గీతల కారే ఇవ్వబోయరంటు బాధితుడు ఆవేదన..!

కొత్త వాహనం వస్తుందనే ఆశతో సింగరేణిలోని ఓ కార్మికుడు రోజుల తరబడి ఎదురుచూశారు. షోరూం నుండి ఫోన్ వస్తుందని, మంచి వాహనం వస్తుందని నమ్మాడు. కానీ షోరూం వాళ్ళు ప్రతిసారీ ఇదిగో వస్తుంది, అదిగో వస్తుంది అంటూ కాలయాపన చేశారని కస్టమర్ ఆరోపించారు. చివరకు వెళ్లి చూస్తే అదే కార్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తిప్పించే ధోరణి వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యానని కస్టమర్ తెలిపారు. డబ్బు కట్టి కూడా ఇలా తిరగాల్సి రావడం బాధాకరమన్నారు. తనలా మరెవరూ మోసపోవద్దని కోరుకుంటు షోరూం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కస్టమర్ డిమాడ్ చేశారు.

కార్ షోరూం నిర్వాహకుల వివరణ..

ఈ కొనుగోలు విషయంపై షోరూం నిర్వాహకులు దిలీప్ ను వివరణ కోరగా గీతలు పడింది వాస్తవమే, కానీ ఎవరు మార్చారో తనకు తెలియదని చెప్పుకొచ్చారు. అయినా కార్ ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదని దురుసుగా ప్రవర్తించడం గమనార్హం. అంతేగాక కొత్తగూడెంలోని మనోహర్ అనే కార్ నిర్వాహకుడి వివరణ కూడా కోరగా ఇష్టం ఉంటే తీసుకోండి, లేదంటే మీ డబ్బులు మీకు రీఫాండ్ చేస్తామని కస్టమర్ కి చెప్పారు. మా దిలీప్ మాట్లాడింది తప్పే అంటు స్వారీ చెప్పారు. ఏది ఏమైనా కస్టమర్స్ దగ్గర దురుసుగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని నలుగురు హెచ్చరించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కార్మికులకు జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్

ములకలపల్లి, అక్టోబర్ 29 ,(ప్రజాజ్యోతి): ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ పిలుపునిచ్చారు. ఈ నెల 31న శనివారం మండల కేంద్రంలోని హమాలీ అడ్డా వద్ద నిర్వహించే వేడుకల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆంగ్లేయుల పాలన కాలం నుంచి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పోరాడుతోందని తెలిపారు. హమాలీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.

చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి అక్టోబర్29(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన సానిక నాగేశ్వరరావు, టోహి ప్రవళిక దంపతుల కుమారుడు హనీష్ వెంకట్ రామ్ కు అన్నప్రాసన వేడుక గురువారం ఘనంగా ఏర్పడి చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆహ్వానించగా, ఆమె హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించినారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని, ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ నరుకొండ రాజేశ్వరి అప్పారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆహార తయారీ కేంద్రాలపై అధికారుల కొరడా!

9 కేంద్రాల లైసెన్సులు సస్పెన్షన్.. పలు యూనిట్లు మూసివేత

కుళ్లిన ముడి పదార్థాలు, అపరిశుభ్ర వాతావరణం గుర్తింపు..

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 ప్రజా జ్యోతి:
ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆహార తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనలు, అపరిశుభ్ర వాతావరణం

గుర్తించడంతో 9 కేంద్రాల లైసెన్సులను సస్పెండ్ చేసి, పలు యూనిట్లను మూసివేశారు. మరో నాలుగు కేంద్రాలకు షోకాజ్ నోటీసులు, ఒక కేంద్రానికి ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేశారు. కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో 10 ప్రత్యేక బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి. మిఠాయి, నూనె, మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్, సోంపు, ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వీట్ల తయారీలో ముఖానికి రాసుకునే రోజ్‌వాటర్ వినియోగిస్తున్నట్లు, చిప్స్ తయారీకి కుళ్లిన బంగాళాదుంపలు, బూజు పట్టిన అల్లం వాడుతున్నట్లు గుర్తించారు. చక్కెర పాకంలో చనిపోయిన దోమలు కనిపించగా, తయారీ కేంద్రాల్లో కుక్కలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన రూ.9,400 విలువైన ఆహార పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఓ సోంపు తయారీ కేంద్రంలో సరైన లేబుల్స్, చిరునామా వివరాలు లేని 5,045 కిలోల ముడి సరుకును సీజ్ చేశారు. వీటి విలువ రూ.5.41 లక్షలుగా అంచనా వేశారు. తుప్పుపట్టిన యంత్రాలు, అపరిశుభ్రమైన నీటి ట్యాంకులు, నూనె నిల్వ డబ్బాలు, పారిశుద్ధ్య లోపాలను గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సుమారు 80 కిలోల ప్యాకేజింగ్ మెటీరియల్‌ను ధ్వంసం చేశారు. అనుమానాస్పద ఆహార నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించడమే తనిఖీల లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. ఆహార తయారీదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వివిధ జిల్లాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులే జవాబుదారీగా చేయాలి

మొదటిపేజీ తరువాయి..

జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం,

అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్‌పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

ప్రభుత్వ కరవు సాయంపైనే రైతుల ఆశలు

ఉమ్మడి జిల్లాలో 45 మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తింపు

తీవ్ర ప్రభావిత మండలాలు గా 11 ఖరారు

తాగునీటి ఎద్దడి, ఇన్పుట్ సబ్సిడీ, రుణాల పునర్ వ్యవస్థీకరణపై స్పెషల్ ఫోకస్

సహాయకచర్యలకు అధికార యంత్రాంగం కసరత్తు

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి):
ఎల్నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తగ్గిన పంటల దిగుబడి, రైతులను సంక్షోభంలోకి నెట్టేసింది. సాధారణ వర్షపాతానికంటే ఈసారి తక్కువ వర్షాలు కురియడం వల్ల జలాశయాల్లో నీరు చేరక పంటల సాగు ఉమ్మడి జిల్లాలో చతికిల పడింది. వర్షాధారంపైనే ఆశలు పెట్టుకుని 80 శాతం పంటలు సాగు చేసిన రైతులకు పంట పెట్టుబడి ఖర్చులు కూడ అందే పరిస్థితి లేక కరవు దుర్భిక్షం వెంటాడుతుంది.
ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారీగా పంటల సాగు విస్తీర్ణం, తగ్గిన దిగుబడులు, జలాశయాల్లో అడుగంటిన నీటి నిలువలు, భూగర్భ జలాల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం 365 మండలాలను కరవు ప్రాంతాలుగా గుర్తించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 45 మండలాలను కరవు ప్రాంతాలుగా ఖరారు చేసింది. వీటిలో 11 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదుకావడంతో తీవ్ర ప్రభావిత మండలాలుగా గుర్తించి యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టనుంది. ఎల్ నినోప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తగ్గిన పంటల దిగుబడి రైతులను సంక్షోభంలో నెట్టేసింది. సాధారణ వర్షాపాతానికంటే ఈ సారి తక్కువ వర్షాలు

కురియడంతో జలాశయాల్లో నీరు చేరక పంటల సాగు ఉమ్మడిజిల్లాలో చతికిల పడింది.వర్షాధారంపైనే ఆశలు పెట్టుకుని 80 శాతం పంటలు సాగుచేసిన రైతులకు పంట పెట్టుబడి ఖర్చులు కూడ అందే పరిస్థితి లేక కరవు దుర్భిక్షం వెంటాడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల వారిగా పంటల సాగువిస్తీర్ణం తగ్గిన దిగుబడులు, జలాశయాల్లో అడుగంటిన నీటి నిలువలు, భూగర్భజలాల నివేదిక ఆధారంగా రాష్ట్రప్రభుత్వం 365 మండలాలను కరువు ప్రాంతాలు గా గుర్తించగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 45 మండలాలను కరవు ప్రాంతాలుగా ఖరారు చేసింది. వీటిలో 11 మండలాల్లో అత్యంత లోటు వర్షాపాతం నమోదుకావడంతో తీవ్ర ప్రభావిత మండలాలుగా గుర్తించి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్ట నుంది.

జిల్లాల వారిగా కరువు మండలాలు ఇవే..:

ఆదిలాబాద్ జిల్లాలో 20 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తించగా తలమడుగు మండలం మినహా భీంపూర్, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ అర్బన్, సిరికొండ, గాదిగూడ, గుడిహత్నూర్, నార్నూర్ ఆదిలాబాద్ రూరల్, మావల, తాంసి, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, ఉట్నూర్ , సొనాల జైనథ్, బేల, సాత్నాల, బోరజ్ మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఇక కొమరం భీం జిల్లాలోని ఐదు మండలాలు అయిన జైనూర్, సిర్పూరు, చింతల మానెపల్లి, బెజ్జూర్, కౌటాల మండలాలు కరవు ప్రాంతాలుగా గుర్తించారు. మంచిర్యాల జిల్లా లోని 11 కరువు మండలాలుగా ఖరారు కాగా వీటిలో జన్నారం, వేమనపల్లి, హాజీపూర్, నెన్నెల, మందమర్రి, మంచిర్యాల, నస్పూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాలను ప్రభుత్వం గుర్తించింది. ఇక నిర్మల్ ల్లాలో 9 మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఖానాపూర్, కుభీర్, బైంసా, కుంటాల, నిర్మల్, సోన్, లక్ష్మణ్ చాందా, కడెం, దస్తురాబాద్ మండలాలు కరువు ప్రభావిత ప్రాంతాల్లో చేర్చారు.

తక్షణ సహాయ చర్యలకు సర్కారు కసరత్తు:

కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం నిర్దేశించిన సహాయ చర్యలపై దృష్టిసారించారు. వ్యవసాయరుణాల పునర్ వ్యవస్థీకరణ, బలవంతపు రుణ వసూళ్లను నిలిపివేయడం, ఇన్పుట్ సబ్సిడి పెంచడం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించడం, పశుగ్రాసం అందు బాటులోఉంచడం లాంటి కీలక బాధ్యతలపై ప్రభుత్వం దృష్టిసారించనుంది. శాస్త్రీయ నివేదికల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో 45 మండలాల్లో కరువుప్రాంతాలను ప్రభుత్వం గుర్తించడంతో రైతుల్లో ఊరట కలిగిస్తుంది.
ముఖ్యంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో రాబోయే ఆరు నెలల పాటు కరువు జాబితా ఆధారంగా సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. సహాయక చర్యలపై రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి.

భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు పూర్తి చేయాలి

గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గురుకుల విద్యార్థినులకు రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో 50 కంప్యూటర్ల పంపిణీ

భద్రాచలం, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి):
శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం

వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్‌తో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి, నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణ, పునరుద్ధరణ పనులను ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ఘాట్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షిత స్నానాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం సీఓఈ, ఎస్ఓఈ గురుకుల కళాశాల విద్యార్థినులకు రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన 50 కంప్యూటర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థినులు విద్యారంగంలో మరింత రాణించేందుకు కంప్యూటర్లు దోహదపడతాయని అన్నారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, తహసీల్దార్ రామ్ కుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

550 ఎకరాలు సర్కార్‌వే!

మొదటిపేజీ తరువాయి..

కొట్టివేసింది. ఓపెన్ మార్కెట్‌లో వేల కోట్ల విలువైన ఈ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం చేయడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పిన ధర్మాసనం.. ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తాము మౌనంగా ఉండలేమని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు యంత్రాంగం చూపిన చొరవను ప్రశంసిస్తూ, ఉమ్మడి హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ భూ వివాదం మూలాలు దశాబ్దాల క్రితం నాటి నిజాం జాగీర్దారీ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి.
సర్వే నంబర్లు 100, 101లలోని భూములను నిజాం కాలం నాటి జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నీసా బేగం తదితరుల నుంచి కొనుగోలు చేశామంటూ గోల్డ్‌స్టోన్ పార్థసారథి, ఆయన సోదరుడు ప్రసాద్, సువిశాల్ జైన్ తదితరులు క్లెయిమ్ చేశారు. ఇర్రివోకబుల్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొంది, సనద్ హక్కుల ప్రకారం ఈ భూములు తమవేనంటూ ట్రినిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సువిశాల్ పవర్, గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థల పేరిట రికార్డులు సృష్టించే యత్నం చేశారు. అప్పట్లో శేరిలింగంపల్లి తహసీల్దార్ ఈ జీపీఏ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు కోర్టులను ఆశ్రయించగా, 2003లో ఉమ్మడి ఏపీ హైకోర్టు తహసీల్దార్ చర్యను సమర్థిస్తూ ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ప్రైవేట్ వర్గం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. సుప్రీంకోర్టులో గత 23 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సుదీర్ఘ కేసుపై తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు అత్యంత బలమైన ఆధారాలతో వాదనలు వినిపించారు. నిజాం నవాబుల కాలంలోనే జాగీర్దార్ కైసరుద్దీన్‌కు ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లించారని, జాగీర్ల రద్దు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ భూములు పూర్తిగా సర్కారు పరం అయ్యాయని స్పష్టం చేశారు. చట్టబద్ధంగా పరిహారం తీసుకున్న తర్వాత కూడా నకిలీ డాక్యుమెంట్లు, మోసపూరిత రెవెన్యూ రికార్డులతో వారసులమంటూ క్లెయిమ్ చేయడం చెల్లదని సర్కారు వాదించింది. ఇప్పటికే ఇందులో మెజార్టీ భూమిని హెచ్ఎండీఏకు అప్పగించామని, మరికొంత భాగాన్ని హైదరాబాద్ మెట్రో రైల్ డిపో నిర్మాణానికి కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలను సమగ్రంగా పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం.. మోసపూరిత రెవెన్యూ రికార్డుల ద్వారా ఎలాంటి యాజమాన్య హక్కులు రావని తేల్చిచెప్పింది. 2003 నాటి ఉమ్మడి హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను పూర్తిగా కొట్టివేసింది. గతంలో 2017లో కూకట్‌పల్లి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా జరిగిన భారీ మియాపూర్ భూ కుంభకోణం వెనుక కూడా ఇదే నెట్‌వర్క్ ఉండటం, క్రిమినల్ కేసులు నమోదు కావడం అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. తాజాగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చి తీర్పుతో ఆ కుంభకోణానికి సైతం పూర్తి స్థాయి న్యాయపరమైన ఫుల్‌స్టాప్ పడింది. తుది తీర్పుతో ఐటీ కారిడార్‌ను ఆనుకుని ఉన్న 550 ఎకరాల అత్యంత విలువైన భూమిపై తెలంగాణ ప్రభుత్వానికి సంపూర్ణ, సర్వహక్కులు ఖరారయ్యాయి. దశాబ్దాలుగా సాగుతున్న సుదీర్ఘమైన, సంక్లిష్టమైన న్యాయపోరాటం తర్వాత ప్రజా ఆస్తులు ప్రైవేట్ భూమాఫియా పరం కాకుండా దక్కించుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సాధించిన అతిపెద్ద లీగల్ విజయంగా నిలిచింది. ఈ తీర్పు రాబోయే రోజుల్లో కబ్జాలకు గురవుతున్న ఇతర ప్రభుత్వ భూముల రక్షణకు , న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులకు ఒక కీలకమైన రోల్ మోడల్‌గా నిలవనుంది.

హైదరాబాద్‌లో భారీ స్కామ్..

మొదటిపేజీ తరువాయి..

వచ్చాయి. కర్మన్‌ఘాట్ పరిధిలో సివిల్ సప్లయ్స్, విజిలెన్స్, జీఎస్టీ, తూనికలు కొలతల శాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటికి వచ్చాయి. ఈ సందర్భంగా బియ్యం బస్తాల బరువులో తేడాలు, లైసెన్సుల ఉల్లంఘనలు, అనుమానాస్పద బ్రాండింగ్ వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని రైస్ డిపోలపై అధికారులు దృష్టి సారించడానికి ప్రధాన కారణం బియ్యం బస్తాలపై ముద్రించిన బరువుకు, వాస్తవంగా ఉన్న బియ్యం పరిమాణానికి మధ్య తేడాలు ఉన్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తడమే. దీంతో అధికారులు బృందాలుగా ఏర్పడి హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపార కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని బస్తాలపై 26 కిలోల బియ్యం ఉన్నట్లు ముద్రించి ఉండగా.. వాటిని తూకం వేసినప్పుడు కేవలం 24 కిలోలు, 25 కిలోల మధ్య మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బస్తాపై పేర్కొన్న బరువుకు తగినంత బియ్యం లేకపోతే కొనుగోలుదారులు నష్టపోయే అవకాశం ఉంది. ఈ విధంగా వినియోగదారులను మోసం చేయడమే కాకుండా, వర్తించే పన్ను నిబంధనలను ఉల్లంఘించే అవకాశం కూడా ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని కొందరు వ్యాపారులు అక్రమంగా సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ బియ్యాన్ని పాలిష్ చేసి.. బస్తాల్లో నింపి, బ్రాండెడ్ కంపెనీల పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్నారనే అనుమానంతో అధికారులు నమూనాలను సేకరించారు. సాధారణంగా రేషన్ బియ్యం ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు

చేరాలి. అది అక్రమంగా ఇతర మార్గాల్లోకి వెళ్లి.. ప్రాసెసింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో అధికారులు బియ్యం నమూనాలను ల్యాబ్‌లకు పంపించి.. వాటి స్వభావం, నాణ్యత, ఇతర వివరాలను పరిశీలించేందుకు చర్యలు చేపట్టారు. కొన్ని బియ్యం బస్తాలపై కనిపించిన ట్రేడ్‌మార్కులు, ఇతర ప్రాంతాల్లో తనిఖీల సందర్భంగా గుర్తించిన బస్తాలపై ఉన్న గుర్తులతో పోలి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ బ్రాండ్ల అసలు యజమానులు ఎవరు.. బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది.. వాటి సరఫరా వెనుక ఎవరున్నారు.. అనే అంశాలపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన అంశం బియ్యం బస్తాల బరువు, జీఎస్టీ నిబంధనలు. బస్తాపై 26 కిలోలు అని ముద్రించి.. 25 కిలోలు, అంతకంటే తక్కువ బియ్యం విక్రయిస్తే అది వినియోగదారుడిని మోసం చేయడమే కాకుండా.. జీఎస్టీ నిబంధనల ఉల్లంఘనకు కూడా దారితీయవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. 25 కిలోల లోపు ఉన్న కొన్ని ప్రీ ప్యాకేజ్డ్, లేబుల్ చేసిన ఆహార ధాన్యాలపై 5 శాతం జీఎస్టీ విధిస్తారు. తనిఖీల సందర్భంగా కొన్ని రైస్ డిపోలు అవసరమైన ట్రేడ్ లైసెన్సులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు తనిఖీలు చేపట్టిన సమయంలో కొందరు దుకాణాల నిర్వాహకులు షాపులు మూసివేసి వెళ్లినట్లు కూడా తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇక.. ఇటీవల హైదరాబాద్ శివార్లలోని ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న ఒక రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. ఆ బియ్యం సిద్దిపేట సమీపంలోని రైస్ మిల్లు నుంచి సరఫరా చేసినట్లు తేల్చారు. సన్న బియ్యం పేరుతో కొన్ని రకాల బియ్యాన్ని కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి.. పాలిష్ చేసి, కొత్త బ్రాండ్ల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించారు. ఈ తనిఖీల్లో భాగంగా సుమారు 20 బృందాలు వివిధ శాఖల సమన్వయంతో రంగంలోకి దిగాయి. బియ్యం నమూనాల పరీక్షలు, పత్రాల పరిశీలన, సరఫరా వివరాల సేకరణ అనంతరం అక్రమాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967